# హైదరాబాద్ పల్స్
జాతీయ తెలుగు దినపత్రిక
దేశం ముఖ్యం.... దేశ ప్రజల భద్రత ముఖ్యం.... మతం కాదు...
epaper.hyderabadpulsenews.in



విలేకరులు కావలెను
హైదరాబాద్ పల్స్ జాతీయ తెలుగు దినపత్రిక
"ఎంతకైనా తెగిస్తాం... ప్రజల గొంతుకై నిలుస్తాం" అనే నినాదంతో రెండు తెలుగు రాష్ట్రాల్లో ప్రారంభించిన హైదరాబాడ్ పల్స్ జాతీయ దినపత్రికకు తెలుగు రాష్ట్రాలలోని అన్ని మండల, నియోజకవర్గాల, జిల్లాల వ్యాప్తంగా విలేకరులు కావలెను. * సీనియర్లకు ప్రాధాన్యత కలదు.
సంప్రదించవలసిన ఫోన్ నెంబర్స్
- Dr. RAHUL KUMAR 9989834020
- K. Naveen Kumar 94406 53413
www.hyderabadpulse.com HyderabadPulse @hyderabad



సీఈఓ : కె నవీన్ కుమార్ | ఎడిటర్: డా. రాహుల్ కుమార్ | సంపుటి: 03 | సంచిక : 166 | పేజీలు : 08 | బుధవారం | 24-06-2026 | వెల :4/-
SIMULTANEOUSLY PUBLISHED FROM HYDERABAD, SANGAREDDY, WARANGAL, MANCHIRYAL, VIJAYWADA, GUNTUR, KURNOOL, TIRUPATI, KADAPA, BENGALURU, MUMBAI, CHENNAI, DELHI.


ఏ స్కీమ్ తెచ్చినా..

## స్కాం ఉంటుంది

- రేవంత్ ఏ స్కీమ్ తెచ్చినా.. దాని వెనుక స్కాం ఉంటుంది: కేటీఆర్
- రేవంత్ కన్ను మెట్రో భూములపై పడిందన్న కేటీఆర్
- సొంత మనుషులకు భూములు కట్టబెట్టేందుకే మెట్రోను స్వాధీనం చేసుకున్నారని ఆరోపణ
- రేవంత్, కిషన్ రెడ్డి ఢిల్లీలో కొత్త డ్రామా మొదలుపెట్టారని ఆరోపణ



2

హైదరాబాద్ పల్స్,హైదరాబాద్

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సీఎం రేవంత్ రెడ్డిపై తీవ్ర ఆరోపణలు చేశారు. రేవంత్ రెడ్డికి ఒక్కటే ఎజెండా ఉందని, అది మెట్రో భూముల స్కామ్ అని మండిపడ్డారు. శేరిలింగంపల్లి నియోజకవర్గం బీఆర్ఎస్

### యూరియా యాప్ పై నిరసన..

- వేముల ప్రశాంత్ రెడ్డి గృహ నిర్బంధం
- యూరియా యాప్ రద్దు చేయాలంటూ వేముల డిమాండ్
- తాడ్వాయి మండలంలో రైతు ధర్నాకు బీఆర్ఎస్ నిర్ణయం
- ఇంటి నుంచి వెళుతుండగా అడ్డుకున్న పోలీసులు

2



# చర్చలు ఫలప్రదం

- మెట్రోపై కేంద్రమంత్రులతో చర్చలు ఫలప్రదం
- ఫేజ్-1 వాల్యుయేషన్, ఫేజ్-2 విస్తరణకు కన్సల్టెంట్ నియామకం
- కేంద్ర మంత్రులతో సీఎం రేవంత్‌రెడ్డి జరిపిన చర్చలు ఫలప్రదం
- మెట్రో ఫేజ్-1 వాల్యుయేషన్, ఫేజ్-2 విస్తరణ కన్సల్టెంట్‌గా ఎస్‌బీఐ క్యాప్స్
- కన్సల్టెంట్ నివేదిక ఆధారంగా భవిష్యత్ కార్యాచరణ



2

హైదరాబాద్ పల్స్,ఢిల్లీ

హైదరాబాద్ మెట్రో రైలు స్వాధీనం, విస్తరణపై కేంద్ర మంత్రులు, ముఖ్యమంత్రి జరిపిన చర్చలు ఫలప్రదమయ్యాయి. కేంద్ర గృహ నిర్మాణ, పట్టణ వ్యవహారాల శాఖ మంత్రి మనోహర్ లాల్ ఖట్టర్, రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్, కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఉదయం ఖట్టర్ నివాసంలో ఈ అంశంపై చర్చించారు. ఈ సందర్భంగా హైదరాబాద్ మెట్రో ఫేజ్- 1 వాల్యుయేషన్, ఫేజ్-1 స్వాధీనానికి అవసరమైన రుణ సేకరణ, మెట్రో ఫేజ్-2 విస్తరణకు సంబంధించిన అంశాలను అధ్యయనం చేసేందుకు కన్సల్టెంట్‌ను నియమించాలని కేంద్రమంత్రులు, సీఎం ఏకాభిప్రాయానికి వచ్చారు. కన్సల్టెంట్‌గా ఎస్బీఐ క్యాప్స్‌ను ఎంపిక చేశారు. కన్సల్టెంట్ నివేదిక ఆధారంగా భవిష్యత్? కార్యాచరణ : మెట్రో ఫేజ్-1 వాల్యుయేషన్, ఫేజ్-2 విస్తరణ, ఇతర అంశాలపై ఎస్బీఐ క్యాప్స్ సమగ్రంగా అధ్యయనం చేయనుంది. ఆ సంస్థ ఇచ్చే నివేదిక ఆధారంగా భవిష్యత్ కార్యాచరణ చేపట్టనుంది. కన్సల్టెంట్ అధ్యయనం సమయంలో సమన్వయానికి ప్రతినిధులుగా కేంద్ర

## సమావేశాలు ఏర్పాటు చేశా

2

### సీఎం రేవంత్ కోసం కేంద్రమంత్రులతో సమావేశాలు ఏర్పాటు చేశా: కిషన్‌రెడ్డి

- రేవంత్‌రెడ్డి రెండుసార్లు లేఖ రాసినట్లు వెల్లడించిన కిషన్ రెడ్డి
- జూన్ 22న అశ్వినీ వైష్ణవ్‌తో సమావేశం ఏర్పాటు చేసినట్లు వెల్లడి
- ఖట్టర్, అశ్విని వైష్ణవ్‌తో సంయుక్త భేటీ జరిగినట్లు తెలిపారు
- సమావేశాలు సానుకూల వాతావరణంలో జరిగాయని వెల్లడి
- తెలంగాణ అభివృద్ధికి ఎప్పుడూ కృషి చేస్తానన్న కేంద్ర మంత్రి



## దేవుడిని నమ్ముతాం

### పెరియార్ నాస్తికత్వాన్ని మేం అంగీకరించలేదు : విజయ్

- పెరియార్ నాస్తికత్వాన్ని అంగీకరించలేదన్న విజయ్
- దేవుడిపై తమకు విశ్వాసం ఉందని స్పష్టీకరణ
- అంబేద్కర్, కామరాజ్ సిద్ధాంతాలే స్ఫూర్తి అన్న సీఎం
- 2026 ఎన్నికల్లో 35% ఓట్లు సాధించామని వెల్లడి
- మాజీ ప్రభుత్వంపై అవినీతి ఆరోపణలు చేసిన విజయ్

2



## ఏటీఎం నగదు చోరీ

- హైదరాబాద్‌లో భారీ చోరీ.. ఏటీఎంకు తెచ్చిన రూ.17 లక్షలు మాయం!
- హైదరాబాద్ ఐఎస్ సదన్‌లో ఏటీఎం నగదు చోరీ
- వ్యాన్ డ్రైవర్ పరారీ.. కుమ్మక్కుపై పోలీసుల అనుమానం
- బైక్‌పై వచ్చి నగదు ట్రంకును ఎత్తుకెళ్లిన దుండగులు
- సీసీటీవీ ఫుటేజీ ఆధారంగా పోలీసుల దర్యాప్తు



2

హైదరాబాద్ పల్స్,హైదరాబాద్

హైదరాబాద్‌లోని ఐఎస్ సదన్ ప్రాంతంలో పట్టపగలే భారీ చోరీ చోటుచేసుకుంది. ఏటీఎంలో నింపేందుకు తీసుకువచ్చిన సుమారు రూ. 17 లక్షల నగదును దుండగులు అపహరించారు. ఈ ఘటన

హర్మ్మూజ్ జలసంధిలో రికార్డు స్థాయిలో

## ఆయిల్ రవాణా

- హర్మూజ్ జలసంధిలో ఒక్కరోజే 19 మిలియన్ బ్యారెళ్ల ఆయిల్ రవాణా
- ఇరాన్‌తో ఒప్పందం వల్లే ఇది సాధ్యమైందని ప్రకటించిన డొనాల్డ్ ట్రంప్
- ఈ పరిణామంతో ప్రపంచవ్యాప్తంగా తగ్గుముఖం పడుతున్న చమురు ధరలు

హైదరాబాద్ పల్స్,డెస్క్

అమెరికా, ఇరాన్‌ల మధ్య ఇటీవల కుదిరిన ఒప్పందం ఆశించిన సత్ఫలితాలనిస్తోందని, హర్మ్మూజ్ జలసంధి ద్వారా చమురు రవాణా తిరిగి భారీగా పుంజుకుందని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వెల్లడించారు. సోమవారం ఒక్కరోజే ఈ జలసంధి గుండా 1.9 కోట్ల బ్యారెళ్ల చమురు రవాణా జరిగిందని, ఇది ఒక సంచలనాత్మక రికార్డు అని ఆయన ప్రకటించారు. ఈ మేరకు

2



8 మంది రెబెల్

## ఎమ్మెల్యేలపై వేటు

- 8 మంది రెబెల్ ఎమ్మెల్యేలపై వేటు వేసిన మమతా బెనర్జీ
- మమతా బెనర్జీ స్థానంలో పార్టీ కొత్త అధ్యక్షుడిని ప్రకటించిన రెబల్ వర్గం
- మరుసటి రోజే 8 మంది కీలక నేతలపై వేటు వేసిన మమత
- టీఎంసీలో తార స్థాయికి చేరిన అంతర్గత పోరు



2

హైదరాబాద్ పల్స్,డెస్క్

తృణమూల్ కాంగ్రెస్ పార్టీలో అంతర్గత పోరు తార స్థాయికి చేరింది. 1998లో పార్టీని స్థాపించి, దశాబ్దాలుగా ఏకఛత్రాధిపత్యంగా నడిపిస్తున్న అధినేత్రి మమతా బెనర్జీ స్థానంలో కొత్త అధ్యక్షుడిని ప్రకటిస్తూ రెబల్ వర్గం సంచలన నిర్ణయం తీసుకుంది. దీనికి రివర్స్ కౌంటర్‌గా మమతా బెనర్జీ 8 మంది రెబల్ ఎమ్మెల్యేలపై వేటు వేశారు. పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్నారంటూ తన

## ఎయిర్‌పోర్ట్ కోసం మరో స్థలం

- కొత్తగూడెం గ్రీన్‌ఫీల్డ్ ఎయిర్‌పోర్ట్ కోసం మరో స్థలం
- రామ్మోహన్ నాయుడితో తుమ్మల, ఉత్తమ్ భేటీ
- కొత్తగూడెం గ్రీన్‌ఫీల్డ్ ఎయిర్‌పోర్ట్
- నిర్మాణాన్ని త్వరగా చేపట్టాలని తుమ్మల, ఉత్తమ్ విన్నపం
- భద్రాచలంకు దేశ, విదేశాల నుంచి భక్తులు వస్తుంటారన్న మంత్రులు
- సానుకూలంగా స్పందించిన రామ్మోహన్ నాయుడు

2



## ఉద్యోగులపై వరాల జల్లు..

### భారీ పెట్టుబడులకు ఆమోదం... ఏపీ క్యాబినెట్ కీలక నిర్ణయాలు

హైదరాబాద్ పల్స్,అమరావతి

ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన మంగళవారం జరిగిన ఆంధ్రప్రదేశ్ మంత్రివర్గ సమావేశం, రాష్ట్ర అభివృద్ధికి బాటలు వేసే దిశగా పలు కీలక నిర్ణయాలు తీసుకుంది. రాష్ట్రానికి భారీ ఎత్తున పెట్టుబడులను ఆకర్షించడం, రాజధాని అమరావతి నిర్మాణ పనులను వేగవంతం చేయడం, ఉద్యోగుల



2

# ఏటీఎం నగదు చోరీ

మొదటి పేజీ తరువాయి

జరిగిన వెంటనే క్యాష్ వ్యాన్ డ్రైవర్ కూడా కనిపించకుండా పోవడంతో, ఇది తెలిసిన వారి పనేనని పోలీసులు ప్రాథమికంగా అనుమానిస్తున్నారు. ఓ క్యాష్ మేనేజ్‌మెంట్ ఏజెన్సీకి చెందిన సిబ్బంది ఏటీఎంలో నగదు నింపేందుకు వ్యాన్‌లో అక్కడికి చేరుకున్నారు. సిబ్బంది ఏటీఎం కియోస్క్‌లోకి వెళ్లిన సమయంలో, ఇద్దరు దుండగులు బైక్‌పై వచ్చి వ్యాన్‌లో ఉన్న నగదు పెట్టెను ఎత్తుకెళ్లారు. ఈ ఘటన జరిగిన కొద్దిసేపటికే డ్రైవర్ కూడా పరారీ కావడంతో, అతడు దొంగలతో కుమ్మక్కై ఉండవచ్చని పోలీసులు భావిస్తున్నారు. సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. పరిసరాల్లోని సీసీటీవీ ఫుటేజీలను క్షుణ్ణంగా పరిశీలిస్తున్నారు. ప్రధానంగా డ్రైవర్ పాత్రపైనే దృష్టి సారించి దర్యాప్తు చేస్తున్నట్లు అధికారులు తెలిపారు. అత్యంత రద్దీగా ఉండే ప్రాంతంలో పట్టపగలే ఈ తరహా చోరీ జరగడం స్థానికంగా తీవ్ర కలకలం రేపింది.

### ఏ స్కీమ్ తెచ్చినా..

# స్కాం ఉంటుంది

మొదటి పేజీ తరువాయి

పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశంలో మాట్లాడిన కేటీఆర్, “రేవంత్ రెడ్డి కన్నంతా మెట్రో భూముల మీదే పడింది. ఏ స్కీమ్ తెచ్చినా దాని వెనుక ఒక స్కామ్ పక్కా ఉంటుంది” అని ఆరోపించారు. మెట్రో సమీపంలో 280 ఎకరాల విలువైన భూములు ఉన్నాయని, వీటి విలువ సుమారు రూ. 30 వేల కోట్లు అని తెలిపారు. రేవంత్ రెడ్డి ఈ భూములను తన అన్నదమ్ములు, బావమరుదులు, అల్లుళ్లకు కట్టబెట్టడానికే మెట్రోను స్వాధీనం చేసుకున్నారని ఆరోపించారు. దీని కోసం ప్రజలపై రూ. 14 వేల కోట్ల భారం మోపారని విమర్శించారు. “కేసీఆర్ ప్రభుత్వం 72 కిలోమీటర్ల మెట్రోను బ్రహ్మాండంగా నిర్మించింది. ఎయిర్‌పోర్ట్ మెట్రో టెండర్లు కూడా పూర్తి చేసి, 2023 జూన్–జులైలోనే పనులు ప్రారంభించాల్సి ఉండగా, రేవంత్ రెడ్డి వచ్చి ఎయిర్‌పోర్ట్ మెట్రోను రద్దు చేశారు. ఇది తుగ్లక్ నిర్ణయం” అని కేటీఆర్ మండిపడ్డారు. ఎయిర్‌పోర్ట్ మెట్రో కొనసాగి ఉంటే ఈ పాటికి పూర్తి అయి ఉండేదని చెప్పారు. భూసేకరణ సమస్య కూడా లేకుండా, ఔటర్ రింగ్ రోడ్డును అనుసంధానం చేసి ట్రాఫిక్ సమస్యలు తగ్గించాలని ఆలోచన చేశామని కేటీఆర్ గుర్తు చేశారు. ప్రస్తుతం కిషన్ రెడ్డి, రేవంత్ రెడ్డి ఢిల్లీలో కొత్త డ్రామా మొదలుపెట్టారని, మళ్లీ మెట్రో పనులు ప్రారంభించాలంటే 2028లో కేసీఆర్‌ను మళ్లీ సీఎంగా చేయాల్సి ఉంటుందని కేటీఆర్ వ్యాఖ్యానించారు.

# 8 మంది రెబెల్ ఎమ్మెల్యేలపై వేటు

మొదటి పేజీ తరువాయి

మాజీ రైట్ హ్యాండ్, మాజీ మంత్రి ఫిర్హాద్ హకీమ్‌తో పాటు మొత్తం ఎనిమిది మంది ఎమ్మెల్యేలను పార్టీ నుంచి మమత శాశ్వతంగా బహిష్కరించారు. బహిష్కరణకు గురైన వారిలో ఫిర్హాద్ హకీమ్, జావేద్ అహ్మద్ ఖాన్, అరూప్ రాయ్ (రెబల్స్ ప్రకటించిన కొత్త ప్రెసిడెంట్), రథిన్ ఘోష్, బిప్లబ్ మిత్ర, సబీనా యాస్మిన్, స్నేహాశిష్ చక్రవర్తి, మాజీ మంత్రి అరూప్ బిశ్వాస్ ఉన్నారు. పశ్చిమ బెంగాల్ అసెంబ్లీలో మొత్తం ఉన్న టీఎంసీ ఎమ్మెల్యేల్లో మెజారిటీ నేతలు తమవైపే ఉన్నారని తిరుగుబాటు వర్గం చెబుతోంది. మొత్తం 80 మంది టీఎంసీ ఎమ్మెల్యేల్లో 60 మంది సపోర్ట్ తమకే ఉందని రెబల్స్ ప్రకటించారు. ఇప్పటికే 28 మంది టీఎంసీ లోక్‌సభ ఎంపీల్లో 20 మంది ఎంపీలు గ్రూప్‌గా విడిపోయి.. ‘నేషనలిస్ట్ సిటిజన్స్ పార్టీ ఆఫ్ ఇండియా’లో విలీనమైన తరుణంలో... మెజారిటీ ఎమ్మెల్యేలు తిరగబడటం మమతా బెనర్జీ పార్టీ మనుగడకే ముప్పుగా మారింది.

# యూరియా యాప్ పై నిరసన..

మొదటి పేజీ తరువాయి



మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డిని పోలీసులు హౌస్ అరెస్ట్ చేశారు. హైదరాబాద్ బంజారాహిల్స్‌లోని ఆయన నివాసానికి చేరుకున్న పోలీసులు.. ఆయనను ఇంటి నుంచి బయటకు రాకుండా గృహ నిర్బంధంలో ఉంచారు. వివరాల్లోకి వెళితే... ‘యూరియా యాప్’ వల్ల రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, ఈ యాప్‌ను తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ నిజామాబాద్ జిల్లా తాడ్వాయి మండలంలో ఒక భారీ రైతు ధర్నా చేపట్టాలని నిర్ణయించారు. ఎల్లారెడ్డి నియోజకవర్గ బీఆర్ఎస్ ఇంచార్జి సురేందర్ ఆధ్వర్యంలో వేలాది మంది రైతులు ఈ నిరసన ప్రదర్శనలో పాల్గొనేందుకు సిద్ధమయ్యారు. ఈ ధర్నాలో పాల్గొనేందుకు తన నివాసం నుంచి బయల్దేరేందుకు వేముల సిద్ధమవగా... పోలీసులు ఆయనను నిలువరించారు. ఆయనను గృహ నిర్బంధం చేశారు

### సమావేశాలు

# ఏర్పాటు చేశా

మొదటి పేజీ తరువాయి

తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి విజ్ఞప్తి మేరకు కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్‌తో సమావేశం ఏర్పాటు చేసినట్లు కేంద్ర మంత్రి జి. కిషన్‌రెడ్డి తెలిపారు. గత రెండు రోజులుగా ఢిల్లీలో రేవంత్‌రెడ్డి పలువురు కేంద్ర మంత్రులతో భేటీ అయ్యేలా తాను సమన్వయం చేసినట్లు వెల్లడించారు. జూన్ 22న అశ్వినీ వైష్ణవ్‌తో సమావేశం జరిగిందని కిషన్ రెడ్డి వెల్లడించారు. ఇవాళ కేంద్ర గృహనిర్మాణ, పట్టణ వ్యవహారాల శాఖ మంత్రి మనోహర్‌లాల్ ఖట్టర్, అశ్విని వైష్ణవ్‌తో కలిసి మరో సమావేశం నిర్వహించినట్లు చెప్పారు. ఈ సమావేశాలు సానుకూల వాతావరణంలో జరిగాయని పేర్కొన్నారు. తెలంగాణ ముఖ్యమంత్రి తనకు రెండుసార్లు లేఖ రాసి కేంద్ర మంత్రులతో భేటీకి అవకాశం కల్పించాలని కోరినట్లు తెలిపారు. కేంద్ర మంత్రివర్గంలో తెలంగాణ ప్రతినిధిగా రాష్ట్ర అభివృద్ధి, ప్రజల సంక్షేమం కోసం ఎప్పుడూ కృషి చేస్తానని కిషన్‌రెడ్డి స్పష్టం చేశారు. తెలంగాణకు సంబంధించిన అభివృద్ధి అంశాల్లో తన వంతు సహకారం అందిస్తానని తెలిపారు

# దేవుడిని నమ్ముతాం

మొదటి పేజీ తరువాయి

పెరియార్ రామస్వామి సామాజిక సిద్ధాంతాలను తాము స్వీకరించినప్పటికీ, ఆయన నాస్తికత్వ భావజాలాన్ని అంగీకరించలేదని తమిళనాడు ముఖ్యమంత్రి విజయ్ స్పష్టం చేశారు. తాము దేవుడిని విశ్వసిస్తామని, ఈ విషయాన్ని ఎప్పుడూ దాచలేదని చెప్పారు. గవర్నర్ ప్రసంగానికి ధన్యవాద తీర్మానంపై అసెంబ్లీలో మాట్లాడిన విజయ్ తమ ప్రభుత్వానికి పెరియార్, డాక్టర్ బీఆర్ అంబేద్కర్, మాజీ సీఎం కామరాజ్ సిద్ధాంతాలే స్ఫూర్తి అని పేర్కొన్నారు. సమాన అవకాశాలు, సామాజిక న్యాయంపై అంబేద్కర్ ఆలోచనలను స్వీకరించామని తెలిపారు. నిజాయతీతో కూడిన పాలన విషయంలో కామరాజ్‌ను ఆదర్శంగా తీసుకున్నామని చెప్పారు. 2026 అసెంబ్లీ ఎన్నికల్లో తమ పార్టీ ఎలాంటి పొత్తులు లేకుండానే పోటీ చేసి 35 శాతం ఓట్లు సాధించిందని విజయ్ తెలిపారు. 1.72 కోట్ల ఓట్లు పొందిన తమ పార్టీ స్వతంత్ర రాజకీయ శక్తిగా ఎదిగిందని అన్నారు. ముందుగా ప్రజల వద్దకు వెళ్లి వారి మద్దతు సంపాదించాకే పార్టీని ఏర్పాటు చేశామని చెప్పారు. రాజకీయ ప్రత్యర్థులు, భావజాల ప్రత్యర్థుల మధ్య తాము స్పష్టమైన తేడా పాటిస్తున్నామని విజయ్ పేర్కొన్నారు. తమ పార్టీని కేవలం సినీ నటుడి పార్టీగా అభివర్ణించే వారు దాని ఎదుగుదలను అర్థం చేసుకోలేకపోతున్నారని వ్యాఖ్యానించారు. 2026 ఎన్నికల్లో మతం, కులం అనే గోడలను చెరిపేసి ప్రజల మద్దతు పొందామని చెప్పారు. గత ప్రభుత్వం పార్టీ నిధుల పేరుతో భారీ అవినీతికి పాల్పడిందని విజయ్ ఆరోపించారు. ఈ వ్యాఖ్యలపై డీఎంకే సభ్యులు సభ నుంచి వాకౌట్ చేశారు. వామపక్ష పార్టీలు తమ కూటమిలో స్వచ్ఛందంగానే చేరాయని, ఎవరి దయాదాక్షిణ్యాల వల్ల కాదని విజయ్ వ్యాఖ్యానించారు.

### హర్మూజ్ జలసంధిలో రికార్డు స్థాయిలో

# ఆయిల్ రవాణా

మొదటి పేజీ తరువాయి

మంగళవారం తన ‘ట్రూత్ సోషల్’ ఖాతాలో ట్రంప్ ఒక పోస్ట్ చేశారు. “నిన్న హర్మూజ్ జలసంధి నుంచి 19 మిలియన్ బ్యారెళ్ల చమురు సరఫరా అయింది. ఇది ఒక సరికొత్త రికార్డు. అంతర్జాతీయ మార్కెట్లో చమురు ధరలు తగ్గుముఖం పడుతున్నాయి. ప్రపంచం ఇప్పుడు మరింత సురక్షితమైన ప్రదేశంగా మారింది” అని ఆయన పేర్కొన్నారు. ఈ సానుకూల పరిణామంతో అంతర్జాతీయ విపణిలో ముడి చమురు ధరలు తగ్గాయి. నిరసనలు, తప్పుడు ప్రచారాల ద్వారా అమెరికా విజయాన్ని తక్కువ చేసే ప్రయత్నాలు జరిగినప్పటికీ, భవిష్యత్తులో అత్యున్నత స్థాయి అణు తనిఖీలకు ఇరాన్ అంగీకరించిందని ట్రంప్ స్పష్టం చేశారు. ఇరాన్ అణు కార్యకలాపాలపై పారదర్శకతకు ఇది భరోసా ఇస్తోందని ఆయన అభిప్రాయపడ్డారు. ఒకవేళ ఇరాన్ ఈ నిబంధనలకు కట్టుబడి ఉండకపోతే, తదుపరి చర్చలకు తావుండదని హెచ్చరించారు. ఇరాన్ చేసిన కొన్ని ప్రతిపాదనల ప్రాతిపదికన, ఎలాంటి దిగ్బంధనం లేకుండా హర్మూజ్ జలసంధిని తెరిచేందుకు తాను అంగీకరించినట్లు ట్రంప్ వివరించారు. ఒకవేళ తిరిగి దిగ్బంధనాన్ని విధిస్తే నౌకల రాకపోకలు ఎక్కడికక్కడే నిలిచిపోతాయని, అయితే ప్రస్తుత పరిస్థితుల నేపథ్యంలో అటువంటి అవసరం రాకపోవచ్చని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. ఒప్పందంలో భాగంగా అమెరికా విడుదల చేసే నిధులను ఇరాన్ కేవలం ఆహారం, వైద్య సామగ్రి వంటి అత్యవసరాల కోసమే వినియోగించగలదని, వాటిని కూడా కేవలం అమెరికా నుంచే కొనుగోలు చేయాల్సి ఉంటుందని ఆయన స్పష్టం చేశారు. ప్రపంచ సముద్ర వాణిజ్యంలో దాదాపు 20 శాతం చమురు రవాణా సౌదీ అరేబియా, యూఏఈ, ఇరాక్ వంటి దేశాల నుంచి హర్మూజ్ జలసంధి ద్వారానే సాగుతుంది. గత కొంతకాలంగా ఇరాన్‌పై అమెరికా విధించిన ఆంక్షలు, దిగ్బంధనాల కారణంగా ఈ మార్గంలో చమురు సరఫరాకు తీవ్ర ఆటంకాలు ఏర్పడి ధరలు పెరిగాయి. అయితే, తాజా ఒప్పందంలో భాగంగా అణు తనిఖీలకు ఇరాన్ సమ్మతించడంతో ప్రాంతీయ ఉద్రిక్తతలు సద్దుమణిగాయి.



# ఎయిర్‌పోర్ట్ కోసం మరో స్థలం

మొదటి పేజీ తరువాయి

తెలంగాణలో విమానయాన కనెక్టివిటీని పెంచే దిశగా రాష్ట్ర ప్రభుత్వం కీలక అడుగులు వేస్తోంది. ఢిల్లీ పర్యటనలో ఉన్న తెలంగాణ మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, ఉత్తమ్ కుమార్ రెడ్డి.. కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడిని ప్రత్యేకంగా కలిశారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో ‘కొత్తగూడెం గ్రీన్‌ఫీల్డ్ ఎయిర్‌పోర్ట్’ నిర్మాణాన్ని త్వరితగతిన చేపట్టాలని వారు కేంద్రమంత్రికి అధికారికంగా విజ్ఞప్తి చేశారు. కొత్తగూడెం వద్ద గ్రీన్‌ఫీల్డ్ ఎయిర్‌పోర్ట్ నిర్మాణం కోసం గతంలో రాష్ట్ర ప్రభుత్వం పంపిన ప్రతిపాదనలపై సివిల్ ఏవియేషన్ శాఖ ఇప్పటికే ఒక ‘ఫీజిబులిటీ సర్వే’ నిర్వహించింది. త్వరితగతిన సర్వే చేయించినందుకు రామ్మోహన్ నాయుడికి ఈ సందర్భంగా తుమ్మల కృతజ్ఞతలు తెలిపారు. అయితే, ఆ టెక్నికల్ సర్వేలో మొదట అనుకున్న స్థలం విమానాశ్రయ నిర్మాణానికి అనువుగా లేదని తేలడంతో.. ఇప్పుడు రాష్ట్ర ప్రభుత్వం తరఫున మరో ప్రత్యామ్నాయ స్థలాన్ని ప్రతిపాదించినట్లు తుమ్మల చెప్పారు. కొత్తగా ప్రతిపాదించిన స్థలంలో త్వరగా టెక్నికల్ అండ్ సేఫ్టీ ఫీజిబులిటీ సర్వే నిర్వహించాలని, గ్రీన్‌ఫీల్డ్ ఎయిర్‌పోర్ట్ ప్రాజెక్ట్ త్వరగా పట్టాలెక్కేలా కేంద్రం చొరవ చూపాలని మంత్రులు కోరారు. దీనిపై కేంద్రమంత్రి కూడా సానుకూలంగానే స్పందించినట్లు తెలుస్తోంది. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో ఎయిర్‌పోర్ట్ ఎందుకు అవసరమనే దానికి మంత్రులు బలమైన కారణాన్ని కేంద్రానికి వివరించారు. ఇక్కడ ఉన్న ప్రముఖ పుణ్యక్షేత్రం, ‘దక్షిణ అయోధ్య’గా ప్రసిద్ధి చెందిన భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి దేవాలయానికి దేశ, విదేశాల నుంచి ప్రతిరోజూ భక్తులు వస్తుంటారని గుర్తుచేశారు. ఎయిర్‌పోర్ట్ వస్తే ఇటు భక్తులకు కనెక్టివిటీ పెరగడంతో పాటు, ఇండస్ట్రియల్‌గా కూడా ఈ ఏరియా బాగా డెవలప్ అవుతుందని స్పష్టం చేశారు.

# చర్చలు ఫలప్రదం

మొదటి పేజీ తరువాయి

ప్రభుత్వం నుంచి ఒక అధికారి, రాష్ట్ర ప్రభుత్వం తరఫున రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ ప్రత్యేక కార్యదర్శి ఉండాలని సమావేశంలో నిర్ణయించారు. ఈ అధికారులు ఇద్దరు సమన్వయం చేసుకుంటూ ఈ ప్రక్రియ వేగంగా సాగేందుకు కృషి చేస్తారు.

మెట్రో ఫేజ్–2 విస్తరణపై చర్చ : హైదరాబాద్ మెట్రో ఫేజ్–1 స్వాధీనం, ఫేజ్–2 విస్తరణపై ఉన్న ఆటంకాలను తొలగించేందుకు సీఎం రేవంత్ రెడ్డి కేంద్ర మంత్రులతో వరుసగా రెండు రోజులు సమావేశమయ్యారు. తొలుత సోమవారం సాయంత్రం రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్, కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డితో సుదీర్ఘంగా చర్చించారు. ఇవాళ కేంద్రమంత్రులు కిషన్ రెడ్డి, అశ్వనీ వైష్ణవ్‌లతో కలిసి ఖట్టర్‌ను కలిసిన సీఎం రేవంత్ రెడ్డి, దాదాపు అరగంట పాటు పలు అంశాలపై చర్చించారు. హైదరాబాద్ నగరంలో చేపట్టనున్న పలు అభివృద్ధి కార్యక్రమాలు, మెట్రో రెండో దశ గురించి చర్చించినట్లు తెలుస్తోంది. సోమవారం రైల్వే శాఖ మంత్రి అశ్వనీ వైష్ణవ్‌ను సీఎం రేవంత్ రెడ్డి, కిషన్ రెడ్డిలు కలిసిన సమయంలో సానుకూల స్పందన వచ్చింది.

# ఉద్యోగులపై వరాల జల్లు..

మొదటి పేజీ తరువాయి

దీర్ఘకాలిక సమస్యల పరిష్కారం, పర్యాటక రంగం అభివృద్ధి వంటి అంశాలపై క్యాబినెట్ ప్రధానంగా దృష్టి సారించింది. సమావేశానంతరం తీసుకున్న నిర్ణయాలను మంత్రి కొలుసు పార్థసారథి మీడియాకు వివరించారు.

**భారీగా పారిశ్రామిక పెట్టుబడులు**

రాష్ట్రంలో పారిశ్రామిక ప్రగతిని పరుగులు పెట్టించే లక్ష్యంతో స్టేట్ ఇన్వెస్ట్‌మెంట్ ప్రమోషన్ బోర్డ్ సిఫారసు చేసిన పలు ప్రతిపాదనలకు మంత్రిమండలి ఆమోదముద్ర వేసింది. మొత్తం రూ. 39,355 కోట్ల పెట్టుబడులతో, 34,610 మందికి ప్రత్యక్షంగా ఉపాధి కల్పించే పరిశ్రమలకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది.

**ఇందులో భాగంగా ఏర్పాటు చేయనున్న కొన్ని ముఖ్యమైన ప్రాజెక్టులు:**

ప్రీమియర్ ఎనర్జీస్ (తిరుపతి): రూ. 3,936 కోట్ల పెట్టుబడితో సిలికాన్ వేఫర్, మాడ్యూల్ తయారీ యూనిట్. 540 మందికి ఉపాధి.

కంట్రోల్ ఎస్ డేటా సెంటర్స్ (అనకాపల్లి): రూ. 2,788 కోట్ల పెట్టుబడితో 1000 మెగావాట్ల డేటా సెంటర్.

ప్రొటేరియల్ ఇండియా (అనకాపల్లి): రూ. 2,250 కోట్ల పెట్టుబడితో నియోడిమియం ఐరన్ బోరాన్ మాగ్నెట్ తయారీ పరిశ్రమ. 530 మందికి ఉపాధి.

ాఖీమాచీజు ఇండియా (కాకినాడ): రూ. 1,900 కోట్ల పెట్టుబడితో వాడిన వంట నూనెల నుంచి విమాన ఇంధనం తయారు చేసే యూనిట్. 2,500 మందికి ఉపాధి.

ఎన్ఎస్ మాగ్నటెక్ (తిరుపతి): రూ. 1,250 కోట్ల పెట్టుబడితో రేర్ ఎర్త్ పర్మనెంట్ మాగ్నెట్ తయారీ. 400 మందికి ఉపాధి.

ఏపీ జేఎస్‌డబ్ల్యూ స్టీల్ (ప్రకాశం): రూ. 1,230 కోట్లతో స్టీల్ బెనిఫికేషన్ ప్లాంట్.

వీటితో పాటు రేర్ ఎర్త్ మెటల్స్ వెలికితీత, గ్రీన్ ఎనర్జీ ప్రాజెక్టులను ప్రోత్సహించడం ద్వారా రాష్ట్రంలో పారిశ్రామికంగా ఎండ్–టు–ఎండ్ ఎకోసిస్టమ్‌ను అభివృద్ధి చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది.

**అమరావతికి జవసత్వాలు**

ఐదేళ్లుగా నిలిచిపోయిన రాజధాని అమరావతి నిర్మాణ పనులను వేగవంతం చేసేందుకు క్యాబినెట్ పలు నిర్ణయాలు తీసుకుంది.

అమరావతిలో డిస్ట్రిక్ట్ కూలింగ్ సిస్టమ్ కోసం గతంలో టాబ్ ర్రీడ్ సంస్థతో కుదుర్చుకున్న ఒప్పందాన్ని రద్దు చేసి, భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా 35,000 టన్నుల సామర్థ్యంతో కొత్త వ్యవస్థ ఏర్పాటుకు నిర్ణయం. ల్యాండ్ పూలింగ్ రైతులకు కేటాయించిన ప్లాట్లలో రోడ్లు, డ్రైనేజీ వంటి మౌలిక సదుపాయాల పనులకు సంబంధించిన టెండర్లకు ఆమోదం. రైతుల ప్లాట్ల సరిహద్దుల వివాదాలను పరిష్కరించేందుకు అవసరమైన రెక్టిఫికేషన్ డీడ్‌లపై స్టాంప్ డ్యూటీ, రిజిస్ట్రేషన్ ఫీజుల నుంచి మినహాయింపు. పనుల పర్యవేక్షణ కోసం ఏపీసీఆర్‌డీఏలో 95 తాత్కాలిక పోస్టుల (డిప్యూటీ కలెక్టర్లు, తహసీల్దార్లు) మంజూరు.

ఆంధ్రప్రదేశ్ జ్యుడీషియల్ అకాడమీ భవన నిర్మాణానికి రూ. 130.38 కోట్లకు టెండర్ ఆమోదం.

**ఉద్యోగులకు శుభవార్త**

ప్రభుత్వ ఉద్యోగుల దీర్ఘకాలిక డిమాండ్లపై క్యాబినెట్ సానుకూలంగా స్పందించింది. 2004కు ముందు నోటిఫికేషన్ పొంది, ఆ తర్వాత నియామకం అయిన 2003 డీఎస్సీ టీచర్లు, 10/99 గ్రూప్–1 ఉద్యోగులు సహా మొత్తం 10,715 మంది సీపీఎస్ ఉద్యోగులకు పాత పెన్షన్ విధానాన్ని వర్తింపజేయాలని నిర్ణయించింది. షెడ్యూల్ 9, 10 పరిధిలోని ప్రభుత్వ రంగ సంస్థల (పీఎస్‌యూ) ఉద్యోగుల పదవీ విరమణ వయసును 60

**పోర్టులు, పర్యాటకం, ఇతర నిర్ణయాలు**

పోర్టుల అభివృద్ధి: కేంద్ర ప్రభుత్వ నూతన చట్టాలకు అనుగుణంగా మచిలీపట్నం పోర్టు పరిధిని 64 కి.మీ. నుంచి 15 కి.మీ.కు, రామయ్యపట్నం పోర్టు పరిధిని 51 కి.మీ. నుంచి 15 కి.మీ.కు కుదిస్తూ నోటిఫికేషన్ల జారీకి ఆమోదం. రామయ్యపట్నం పోర్టును డీబీఎఫ్ఓటీ పద్ధతిలో అభివృద్ధి చేసేందుకు ఆపరేటర్ నియామకానికి ఆర్ఎఫ్‌పీ జారీకి అనుమతి. పర్యాటకం: గ్రామీణ ప్రాంతాల్లో పర్యాటకాన్ని ప్రోత్సహించేందుకు ‘హోమ్ స్టే’, ‘బెడ్ అండ్ బ్రేక్‌ఫాస్ట్’ ఏర్పాటును సులభతరం చేస్తూ పర్యాటక పాలసీకి సవరణలు. తిరుపతి మినహా రాష్ట్రంలోని ఇతర విమానాశ్రయాల్లో అంతర్జాతీయ ప్రమాణాలతో బార్లు, రిటైల్ మద్యం దుకాణాల ఏర్పాటుకు నూతన విధానానికి ఆమోదం. రవాణా శాఖ: ఇతర రాష్ట్రాల్లో రిజిస్ట్రేషన్ చేయించుకుంటున్న టూరిస్ట్ బస్సులను రాష్ట్రంలోకి ఆకర్షించేందుకు, ఆల్ ఇండియా టూరిస్ట్ పర్మిట్ వాహనాల త్రైమాసిక పన్నును ప్రతి సీటుకు రూ. 4,000 నుంచి రూ. 2,500కు తగ్గింపు.

# వేద విద్య ప్రవేశ పరీక్షకు విశేష స్పందన..!

- తొలి విడతలో 68 మంది విద్యార్థుల హాజరు
- త్వరలో రెండో విడత పరీక్ష



**హైదరాబాద్ పల్స్ న్యూస్, జూన్ 23, ఝరాసంగం :** సంగారెడ్డి జిల్లా ఝరాసంగం మండలంలోని బర్దిపూర్ శ్రీ దత్తగిరి మహారాజ్ ఆశ్రమ వేద పాఠశాలలో 2026--27 విద్యా సంవత్సరానికి విద్యార్థుల ప్రవేశాల కోసం నిర్వహించిన తొలి విడత మౌఖిక పరీక్ష మంగళవారం విజయవంతంగా జరిగింది. పరీక్షలకు వివిధ ప్రాంతాల నుంచి మొత్తం 98 మంది దరఖాస్తు చేసుకోగా మంగళవారం నిర్వహించిన మౌఖిక పరీక్షకు తెలుగు మంచిర్యాల, బెల్లంపల్లి, హైదరాబాద్, నారాయణఖేడ్, కరీంనగర్, కల్వకుర్తి, పెద్దపల్లి, నిర్మల్, వికారాబాద్, కామారెడ్డి, ఆమనగల్, కొమరం భీమ్, ఆసిఫాబాద్, గిరవెల్లి, నిర్మల్, జహీరాబాద్ తో పాటు మహారాష్ట్ర కర్ణాటక రాష్ట్రాలకు చెందిన 68 విద్యార్థులు హాజరై తమ ప్రతిభను ప్రదర్శించారు. వేద విద్యపై ఆసక్తి కలిగిన విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొనడం సంతోషకరమని ఆశ్రమ పీఠాధిపతి అవధూత గిరి మహారాజ్, సిద్దేశ్వరానందగిరి మహారాజ్ పేర్కొన్నారు. త్వరలోనే మరో విడత మౌఖిక పరీక్ష నిర్వహిస్తున్నట్లు ఈ పరీక్షలు రాజయోగ ఆశ్రమ పీఠాధిపతి రాచయ్య స్వామి, నందిని గిరి, పర్యవేక్షణలో జరిగింది. అన్ని వర్ణాల వారు వేద విద్యను అభ్యసించాలనుకునే విద్యార్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. మరిన్ని వివరాల కోసం 8639258008, 9177259329 లేదా నంబర్లలో సంప్రదించవచ్చని తెలిపారు

# రాజేంద్రప్రసాద్, మురళీమోహన్ కు పద్మశ్రీ

## కేంద్రం నిర్వహించిన పద్మ అవార్డు కార్యక్రమంలో కామదేను ప్రెసిడెంట్ పి.వెంకటేష్

**పటాన్చెరు, హైదరాబాద్ పల్స్ న్యూస్, జూన్ 23 :** దేశ రాజధాని న్యూఢిల్లీలో జరిగిన పద్మ అవార్డు ప్రధాన కార్యక్రమంలో ప్రముఖ తెలుగు సినీ నటులు డాక్టర్ రాజేంద్రప్రసాద్ మరియు మురళీమోహన్ గార్లకు రాష్ట్రపతి భవనంలో పద్మశ్రీ అవార్డు ప్రదానం చేయబడ్డది. కార్యక్రమంలో ప్రముఖ పొలిటికల్ మరియు సినీ సందర్శకులు పాల్గొనారు. కార్యక్రమ వివరణ రాష్ట్రపతి భవనంలో సన్మానంగా మహోన్నత అవార్డుల ప్రదానోత్సవం జరిగింది. ప్రెసిడెంట్ కామదేను ఫౌండేషన్ కన్వీనర్ పి. వెంకటేష్, భారతీయ జనతా పార్టీ నేతలు, సినీ నటుడు రాజ్ కుమార్, పి. రవీందర్ (హెచ్డిఎఫ్సి బ్యాంక్ డిజిఎం), కప్పే యాదగిరి తదితర ప్రముఖులు ప్రధాన అతిధులుగా పాల్గొన్నారు.

**రాజేంద్రప్రసాద్ - హాస్యబాహుముఖం**

గత 40 సంవత్సరాలుగా తెలుగు ప్రజల హృదయాల్లో విలక్షణమైన స్థానం సంపాదించుకున్న హాస్య నటుడు డాక్టర్ రాజేంద్రప్రసాద్, తన సుదీర్ఘ సేవకు వీలుగా పద్మశ్రీను అందుకున్నారు. అవార్డ్ స్వీకరణ సందర్భంగా ఆయన భావోద్వేగంగా నిలిచారు మరియు తెలుగు ప్రేక్షకుల ప్రేమకు కృతజ్ఞతలు తెలిపారు.

**మురళీమోహన్ - నాట్యనాయకుడికి గుర్తింపు**

నాటితర రచనా-నటనా ప్రతిభకు పేరుగాంచిన మురళీమోహన్ ని కూడా పద్మశ్రీతో సన్మానించారు.



ఆయన శాంత, సహజ నటనకు అధికారం ఇవ్వడమే ఈ అవార్డు ద్వారా భారత ప్రభుత్వం చూపిన గౌరవమన్నారు. ప్రశంసలు మరియు కృతజ్ఞతలురెండు బాధ్యతాయుత మరియు ప్రజాదరణ గల నటులుగా 40 సంవత్సరాల కాలం పాటు తెలుగు సంస్కృతి, వినోద రంగానికి అపార సంభ్రమం చూపినవారిగా కమిటీ అభివర్ణించింది. అవార్డ్ ప్రకటించినప్పటికీ ఈ గొప్పతనానికి భారత ప్రభుత్వానికి నటులు, అభిమానులు ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు.

# సిగాచి బాధితులకు పూర్తి నష్టపరిహారం ఎప్పుడిస్తారు?

**ప్రభుత్వాన్ని ప్రశ్నించిన పటాన్ చెరు నియోజకవర్గ కో- ఆర్డినేటర్ ఆదర్శ్ రెడ్డి.**

**పటాన్ చెరు మండల ఇంచార్జ్ మాజీ జెడ్పీటీసీ గడీల శ్రీకాంత్ గౌడ్**

పటాన్ చెరు, హైదరాబాద్ పల్స్ న్యూస్, జూన్ 23 : జూన్ 30 న ఇస్నాపూర్ మున్సిపల్ పరిధిలోని బీపీల్ చౌరస్తాలో సంస్మరణ సభకు హాజరు కానున్న మాజీ మంత్రి హరీష్ రావు. సిగాచి బాధితులతో కలిసి సంస్మరణ సభకు కార్మికులు బీఆర్ఎస్ నాయకులు కార్యకర్తలు హాజరు కావాలని పిలుపు. ఇస్నాపూర్ మున్సిపల్ పరిధిలోని శ్రీకాంత్ గౌడ్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ..పటాన్ చెరు పరిధిలోని సిగాచి పరిశ్రమలో జరిగిన దుర్ఘటనలో ప్రాణాలు కోల్పోయిన వారి కుటుంబాలకు మరియు తీవ్రంగా గాయపడిన బాధితులకు ప్రభుత్వం ఇప్పటివరకు పూర్తి స్థాయిలో న్యాయం చేయలేదని పటాన్ చెరు నియోజకవర్గ కో-ఆర్డినేటర్ ఆదర్శ్ రెడ్డి, పటాన్ చెరు మండల ఇంచార్జ్ మాజీ జెడ్పీటీసీ గడీల శ్రీకాంత్ గౌడ్ ఆవేదన వ్యక్తం చేశారు.ప్రమాదం జరిగిన వెంటనే ఘటన స్థలానికి చేరుకొని అక్కడ అస్తవ్యస్తంగా ఉన్న అధికారులను గాడిలో పెట్టి, బాధిత కుటుంబాలను పరామర్శించి, వారి సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లిన ఏకైక




నాయకుడు మాజీ మంత్రి వర్యులు హరీష్ రావు గారేనని తెలిపారు. బాధితులకు తక్షణ ఆర్థిక సహాయం అందించడంతో పాటు, శాశ్వత నష్టపరిహారం, కుటుంబ సభ్యులకు ఉద్యోగాలు, గాయపడిన వారికి మెరుగైన వైద్యం అందించాలని ప్రభుత్వం పై నిరంతరం ఒత్తిడి తీసుకువచ్చారని పేర్కొన్నారు.అయితే, ప్రమాదం జరిగి చాలా కాలం గడిచినా ఇప్పటికీ పలువురు బాధిత కుటుంబాలకు పూర్తి స్థాయి నష్టపరిహారం అందలేదని, గాయపడిన కార్మికులు ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వం వెంటనే స్పందించి పెండింగ్లో ఉన్న నష్టపరిహారాన్ని విడుదల చేసి బాధిత కుటుంబాలకు అండగా నిలవాలని డిమాండ్ చేశారు.మాజీ మంత్రి హరీష్ రావు చొరవతోనే బాధితుల సమస్యలు రాష్ట్రవ్యాప్తంగా చర్చకు వచ్చాయని, బాధితులకు న్యాయం జరిగే వరకు భారత రాష్ట్ర సమితి పార్టీ వారి తరఫున పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు.సిగాచి బాధితుల పట్ల ప్రభుత్వం నిర్లక్ష్య వైఖరిని వీడి, మానవతా దృక్పథంతో వ్యవహరించి వెంటనే పూర్తి నష్టపరిహారం అందించాలని, మృతుల కుటుంబాలకు ప్రకటించిన హామీలను అమలు చేయాలని, గాయపడిన కార్మికులకు దీర్ఘకాలిక వైద్య సహాయం మరియు ఉపాధి భద్రత కల్పించాలని వారు డిమాండ్ చేశారు.మాజీ మంత్రి వర్యులు హరీష్ రావు ఆదేశాల మేరకు సిగాచి బాధితుల కుటుంబాలతో కలిసి సంస్మరణ సభ నిర్వహించనున్నట్లు తెలియజేశారు. సిగాచి ఘటనలో మరణించిన వారికి నివాళులు అర్పించి వారి సమస్యలను ప్రభుత్వానికి వివరించే వేదికగా ఈ సభ ఉంటుందని అన్నారు.బాధిత కుటుంబాలకు పూర్తి న్యాయం జరిగే వరకు తమ పోరాటం కొనసాగుతుందని ఆదర్శ్ రెడ్డి, గడీల శ్రీకాంత్ గౌడ్ హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఇస్నాపూర్ మున్సిపల్ చైర్మన్ మోట శ్రీకాంత్, మున్సిపల్ కౌన్సిలర్స్ బేగరి గాయత్రి పాండు ,మచ్చ కిషోర్ రెడ్డి, ఎల్లకొండ రాహుల్ రెడ్డి, బూరిగారి నరేందర్ రెడ్డి , బేగరి వెంకటేష్, వడ్డే గడ్డ రాజు, జనార్దన్ రెడ్డి, పెలిమెల వెంకట్, కొమిరిశెట్టి అరుణ్, గొంగోళ్ల నవీన్ రెడ్డి, కో ఆప్షన్ సభ్యులు విష్ణు వర్ధన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు

# అయోధ్య రామాలయం విరాళాల గోల్‌మాల్..
# ప్రభుత్వానికి సిట్ ప్రాథమిక నివేదిక సమర్పణ!

హైదరాబాద్ పల్స్ న్యూస్, జూన్ 23, ఉత్తరప్రదేశ్ : దేశంలోనే అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్మించబడిన అయోధ్య రామలయం విరాళాల్లో గోల్ మాల్ జరిగినట్లు అధికారులు గుర్తించారు. ఈ మేరకు యూపీ ప్రభుత్వం పూర్తి స్థాయి విచారణకు సిట్ ను ఏర్పాటు చేయగా.. అన్ని కోణాల్లో పూర్తిగా విచారించారు. అయోధ్య శ్రీరామ జన్మభూమి ఆలయానికి భక్తులు సమర్పించిన విరాళాలు, నగదు, బంగారు, వెండి కానుకల మళ్లింపు (దుర్వినియోగం) ఆరోపణలపై దర్యాప్తు చేస్తున్న ప్రత్యేక దర్యాప్తు బృందం మంగళవారం ఉదయం తన ప్రాథమిక నివేదికను ఉత్తరప్రదేశ్ ప్రభుత్వానికి సమర్పించింది. లక్నో డివిజనల్ కమిషనర్ విజయ్ విశ్వాస్ పంత్ నేతృత్వంలోని ముగ్గురు సభ్యుల సిట్ బృందం, ఈ నివేదికను యూపీ హోంశాఖ అదనపు ప్రధాన కార్యదర్శి సంజయ్ ప్రసాద్‌కు అందజేసింది.

**పర్యవేక్షణ లోపం - నిర్లక్ష్యం:** ఆలయ హుండీ కానుకల లెక్కింపు, భద్రత, సీసీటీవీ ఫుటేజ్ నిర్వహణ, బ్యాంకుల్లో డిపాజిట్ చేసే ప్రక్రియలో తీవ్రమైన లోపాలు, నిర్లక్ష్యం జరిగినట్లు సిట్ ప్రాథమికంగా గుర్తించింది.


ట్రస్టు సిబ్బంది పాత్ర: విరాళాల లెక్కింపు, నిర్వహణతో సంబంధం ఉన్న దాదాపు 150 మందిని (ట్రస్టు సిబ్బంది, బ్యాంకు అధికారులు, ప్రైవేట్ ఉద్యోగులు) సిట్ ప్రశ్నించింది. బంగారం, వెండి, వజ్రాల వంటి విలువైన కానుకల లెక్కలపై కొందరు ఆఫీస్ బేరర్లు ఇచ్చిన సమాధానాలు ఏమాత్రం సంతృప్తికరంగా లేవని తేలింది.

**మహా కుంభమేళా సమయంలోనే అక్రమాలు:**

జనవరి-ఫిబ్రవరి 2025లో జరిగిన మహా కుంభమేళా సమయంలో రోజుకు దాదాపు 10 లక్షల మంది భక్తులు రావడంతో, భారీగా వచ్చిన నగదు విరాళాలను మళ్లించడంలో పెద్ద ఎత్తున అక్రమాలు జరిగినట్లు అధికారులు అనుమానిస్తున్నారు. ఈ కుంభకోణం విలువ రూ. 200 కోట్లకు పైనే ఉండవచ్చని అంచనా.

**సిట్ సిఫార్సులు - తదుపరి చర్యలు:**

అక్రమాలకు బాధ్యులైన వారిపై తక్షణమే అధికారికంగా ఎఫ్ఐఆర్ నమోదు చేసి చట్టపరమైన విచారణ జరపాలని, దొంగిలించిన సొమ్మును రికవరీ చేయాలని సిట్ సిఫార్సు చేసింది. ఈ కేసులో ఇప్పటికే ఐదుగురు అనుమానితుల నుంచి రూ. 2 కోట్ల నగదు, ఒక ఎస్‌యూవీ వాహనం, 3 ఐఫోన్లను రికవరీ చేశారు. అలాగే, గతంలో విరాళాల లెక్కింపులో ఉన్న పాత సిబ్బంది అందరినీ విధుల నుంచి తొలగించారు. ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ ఆదేశాల మేరకు ఈ నివేదిక సమర్పించబడగా.. రాబోయే 10 నుంచి 15 రోజుల్లో పూర్తి స్థాయి తుది నివేదికను జూఅందజేస్తామని సిట్ సభ్యుడు విజయ్ విశ్వాస్ పంత్ తెలిపారు. ఈ నివేదిక ఆధారంగా దోషులపై సీఎం యోగి కఠిన చర్యలు తీసుకునే అవకాశం ఉండటంతో దేశవ్యాప్తంగా ఈ వ్యవహారం సంచలనంగా మారింది.



# అంబేద్కర్ నగర్‌ల హత్య నిందితుల అరెస్ట్



**హైదరాబాద్ పల్స్ న్యూస్, జూన్ 23, భద్రాద్రి జిల్లా ప్రతినిధి :** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చుంచుపల్లి మండలం అంబేద్కర్ నగర్ గ్రామపంచాయతీలో ఇనగంటి నాగరాజు హత్య కేసులో నిందితుల అరెస్టు. డి.ఎస్.పి ఆదినారాయణ తెలిపిన వివరాల ప్రకారం అంబేద్కర్ నగర్ కు చెందిన శివాజీ సన్నాఫ్ శ్రీను అను అతను తన భార్యను అదే గ్రామానికి చెందిన ఇనగంటి నాగరాజు వెంట పడి వేధిస్తున్నాడు అని, భర్త కి చెప్పగా 21 జూన్ 2026 న రాత్రి 10 : 20 గంటల సమయంలో సాధన శివాజీ అతని భార్య నాగేశ్వరి అతని చెల్లెలు పరిశుద్ధ అలియాస్ ప్రమీల పథకం ప్రకారంగా నాగరాజుని చంపాలని నిర్ణయించుకొని సాధన శివాజీ భార్య చెల్లెలి ప్రోద్బలంతో అదే రోజు రాత్రి 10 20 గంటల సమయంలో నాగరాజు ఇంటికి వెళ్లి ఇంటిలో పడుకుని ఉన్న నాగరాజుని కత్తితో పొడిచి పారిపోగా మంగళవారం శివాజీ ఇంటికి వచ్చినాడని సమాచారం మేరకు ఇన్స్పెక్టర్ ఎం కరుణాకర్ తన సిబ్బందితో శివాజీ ఇంటికి వద్దకు వెళ్లి అరెస్టు చేసి విచారించి అరెస్టు చేసి అతని వద్దనుండి నాగరాజుని పొడిచి చంపిన కత్తినీ అతని ఒంటిపై ఉన్న టీ షర్టును స్వాధీన పరుచుకొని రిమాండ్ చేయటం జరిగిందని కొత్తగూడెం డిఎస్పి ఆదినారాయణ మీడియా సమావేశంలో తెలియజేసినారు ఈ కార్యక్రమంలో వన్ టౌన్ సీఐ కరుణాకర్,టూ టౌన్ ఎస్ఐ లు రాజ శేఖర్, జీవన్ రాజ్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# రాజాపేట తహసీల్దార్ గా జి.రవి కిరణ్ కుమార్ బాధ్యతల స్వీకరణ....


## రెవెన్యూ సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇస్తా : ఎంఆర్ఓ



**హైదరాబాదు పల్స్ న్యూస్, జూన్ 23, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి :** రాజపేట మండల నూతన తహసీల్దార్ గా జి. రవి కిరణ్ కుమార్ మంగళవారం రోజు బాధ్యతలు స్వీకరించారు. బాధ్యతలు చేపట్టిన అనంతరం ఆయన మండల సిబ్బందితో సమావేశమై, ప్రజలకు త్వరితగతిన, పారదర్శకంగా సేవలు అందించాలని సూచించారు. రెవెన్యూ సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇస్తానని, ఎవరికీ ఎలాంటి ఇబ్బంది లేకుండా పనులు చేయిస్తానని హామీ ఇచ్చారు. పేదలకు, రైతులకు సంబంధించిన భూ సమస్యలు, సర్టిఫికెట్ల జారీ వంటి వాటిలో జాప్యం జరగకుండా చూస్తానని తెలిపారు. ప్రజల నుంచి వచ్చే దరఖాస్తులను సానుకూలంగా పరిష్కరిస్తానని పేర్కొన్నారు. బాధ్యతలు స్వీకరించిన నూతన ఎంఆర్ఓ, జి.రవి కిరణ్ కుమార్‌ను మండల అధికారులు, సిబ్బంది, ప్రజాప్రతినిధులు, రాజకీయ నాయకులు, కార్యకర్తలు శాలువాతో సత్కరించి అభినందనలు తెలిపారు.

# విత్తన మేళాను రైతులు సద్వినియోగం చేసుకోవాలి

## హుగ్గెల్లీ గ్రామ సర్పంచ్ పట్లోళ్ళ. విమల శ్రీనివాస్ రెడ్డి



**హైదరాబాద్ పల్స్ న్యూస్, జహీరాబాద్, జూన్ 23:** మండలంలోని హుగ్గెల్లి గ్రామంలో రైతు వేదికలో మంగళవారం విత్తనాలు మేళ పంపిణీ కార్యక్రమాన్ని మండల వ్యవసాయ అధికారిణి లావణ్యతో కలిసి ప్రారంభించిన హుగ్గెల్లీ గ్రామ సర్పంచ్ విమల శ్రీనివాస్ రెడ్డి. అనంతరం వారు మాట్లాడుతూ.... రైతులకు రెడ్అమ్, గ్రీన్రామ్, బ్లాక్గ్రామ్, సోయాబీన్ విత్తనాలతో పాటు నానో యూరియా, నానో డీఏపీ, కూరగాయల విత్తనాలు అందుబాటులో ఉంటాయని పేర్కొన్నారు. హుగ్గెల్లి క్లస్టర్లో రైతులకు ఉచిత మినీ కిట్లను కూడా పంపిణీ చేసినట్లు వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో క్లస్టర్ ఏఈవో, రైతులు,మహిళా రైతులు, గ్రామస్తులు మరియు తదితరులు పాల్గొన్నారు.

# భవిష్యత్తుకు సిద్ధమైన నిపుణులను తీర్చిదిద్దుతున్న గీతం ఆంగ్ల విభాగం

## ఆంగ్లంలో బీఏ, ఎంఏ కోర్సులలో చేరడానికి ఈనెల 26లోగా దరఖాస్తు చేసుకోవాలి

**పటాన్ చెరు, హైదరాబాద్ పల్స్ న్యూస్, జూన్ 23 :** గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం, హైదరాబాదులో గల ఆంగ్ల, ఇతర భాషల విభాగం, ఆంగ్లంలో అందించే యూజీ, పీజీ, పీహెచ్.డీ. కోర్సులలో చేరాలనే ఆసక్తి ఉన్న అభ్యర్థులు ఈనెల 26లోగా దరఖాస్తు చేసుకోవాలని ఆ విభాగాధిపతి డాక్టర్ సయంతన్ మోండల్ మంగళవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో కోరారు. తమ విభాగం ద్వారా భవిష్యత్తుకు సిద్ధమైన నిపుణులను తీర్చిదిద్దుతున్నట్టు ఆయన వెల్లడించారు. స్కూల్ ఆఫ్ హ్యూమానిటీస్ అండ్ సోషల్ సైన్సెస్ (జీ.ఎస్.హెచ్.ఎస్)లో భాగంగా ఉన్న ఈ విభాగం, మేధోపరమైన పటిమ, సృజనాత్మకత, పరిశోధనా నైపుణ్యాన్ని మేళవించి ఒక ఉత్సాహభరితమైన విద్యా వాతావరణాన్ని అందిస్తోందన్నారు.ఆంగ్ల విభాగంలో ప్రఖ్యాత జాతీయ, అంతర్జాతీయ సంస్థల నుంచి విస్తృతమైన బోధన, పరిశోధనా అనుభవం కలిగిన విశిష్ట అధ్యాపకుల బృందం ఉన్నట్టు డాక్టర్ సయంతన్ తెలియజేశారు. వారి నైపుణ్య రంగాలలో ఆంగ్లంలో




భారతీయ రచన, ముద్రణ సంస్కృతి, అనువాద అధ్యయనాలు, వలస సాహిత్యం, డిజిటల్ హ్యూమానిటీస్, లింగ, లైంగికత అధ్యయనాలు, అట్టడుగు వర్గాలు, సాహిత్యం, సామాజిక భాషా శాస్త్రం, ఆంగ్ల భాషా విద్య, శైలిశాస్త్రం, ధ్వనిశాస్త్రం వంటివి ఉన్నాయన్నారు.అమెరికన్ సాహిత్యం, బ్రిటిష్ సాహిత్యం, ఆంగ్లంలో భారతీయ రచనలలో బలమైన పునాదిని విద్యార్థులు పొందుతారని డాక్టర్ మోండల్ తెలిపారు. అదే సమయంలో, డిజిటల్ హ్యూమానిటీస్, తులనాత్మక సాహిత్యం, సాంస్కృతిక అధ్యయనాలు, అనువర్తిత భాషాశాస్త్రం, ఆంగ్ల భాషా విద్య వంటి అభివృద్ధి చెందుతున్న విభాగాలను కూడా విద్యార్థులు అన్వేషిస్తారని ఆయన వివరించారు. విద్యానుభవాన్ని సుసంపన్నం చేయడానికి, ఈ విభాగం ప్రఖ్యాత పండితులు, నిపుణులతో కార్యశాలలు, సమావేశాలు, నిపుణుల ఉపన్యాసాలు, జ్ఞాన-భాగస్వామ్య కార్యక్రమాలను క్రమం తప్పకుండా నిర్వహిస్తోందన్నారు.ఆంగ్ల విభాగం నుంచి పట్టభద్రులైన వారు విద్య, పరిశోధనా రంగం, సృజనాత్మక రచన, అనువాదం, మీడియా, జర్నలిజం, కంటెంట్, సాంకేతిక రచన, ప్రచురణ, కాపీ ఎడిటింగ్, కార్పొరేట్ కమ్యూనికేషన్, విధాన పరిశోధన సంస్థలలో విభిన్న వృత్తి అవకాశాలను చేపట్టడానికి సన్నద్ధులై ఉంటారన్న ధీమాను ఆయన వ్యక్తపరిచారు.డీన్ ప్రొఫెసర్ రథిన్ రాయ్, డైరెక్టర్ డాక్టర్ శామ్యూల్ ధరు, విభాగాధిపతిగా తన నాయత్వంలో ఆంగ్ల, ఇతర భాషల విభాగం పనిచేస్తోందని తెలిపారు. గీతం ప్రవేశ పరీక్షలో ప్రతిభ కనబరిచిన అత్యుత్తమ విద్యార్థులకు మెరిట్ ఆధారిత స్కాలర్ షిప్పులు అందుబాటులో ఉన్నాయన్నారు.

# ఇక్రిసాట్ కాలనీ సమస్యల పరిష్కారానికి కృషి : ఎమ్మెల్యే జిఎంఆర్

## కాలనీ వాసులతో సమావేశం.. క్షేత్రస్థాయిలో పర్యటన..

**అమీన్పూర్, హైదరాబాద్ పల్స్ న్యూస్, జూన్ 23 :** బీరంగూడ డివిజన్ పరిధిలోని ఇక్రిసాట్ ఫేజ్ 1 కాలనీ సమస్యల పరిష్కారానికి ప్రణాళిక బద్ధంగా నిధులు కేటాయించి నిర్దేశించిన గడువులోగా పనులు పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకొని వస్తామని పటాన్చెరు శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి తెలిపారు.మంగళవారం ఉదయం వివిధ శాఖల అధికారులు, మాజీ ప్రజా ప్రతినిధులతో కలిసి కాలనీలో పర్యటించారు. ఈ సందర్భంగా కాలనీ వాసులతో సమావేశమై.. వారు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రత్యక్షంగా అడిగి తెలుసుకున్నారు. ప్రధానంగా అంతర్గత సిసి రోడ్లు, నూతన డ్రైనేజీ, మంచినీటి పైప్ లైన్ ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఇందుకు సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్యే జిఎంఆర్.. కాలనీ పరిధిలో



నూతనంగా అంతర్గత రహదారులు, డ్రైనేజీ పైప్లైన్, మంచినీటి పైపుల నిర్మాణాలకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. వచ్చే నెల రోజుల్లోగా నిధులు మంజూరు చేసి పనులు ప్రారంభిస్తామని హామీ ఇచ్చారు. కమ్యూనిటీ హాల్ అంశాన్ని సైతం పరిష్కరిస్తామని తెలిపారు. ఈ సమావేశంలో మున్సిపల్ మాజీ చైర్మన్ తుమ్మల పాండురంగారెడ్డి, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్




నరసింహ గౌడ్, అమీన్పూర్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ ప్రదీప్ కుమార్, ఈఈ సురేష్, జలమండలి జిఎం శ్రీనివాస్ రెడ్డి, డిఇ వెంకట రమణ, డిజిఎం శివ కుమార్, మాజీ ప్రజా ప్రతినిధులు, కాలనీ సంక్షేమ సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.

# నూతన వేతనాలు వెంటనే అమలుపరచాలి

**రాష్ట్ర కనీస వేతనం మండలి**

### సభ్యుడు యారం పిచ్చిరెడ్డి

**హైదరాబాద్ పల్స్ న్యూస్, జూన్ 23, భద్రాద్రి జిల్లా ప్రతినిధి :** నూతన వేతన జీవో వెంటనే అమలు పరచాలని కోరుతూ ఐటీసీ యాజమాన్యానికి రాష్ట్ర కనీస వేతన మండలి సభ్యుడు ఐఎన్టీయూసీ ప్రధాన కార్యదర్శి యారం పిచ్చిరెడ్డి ఆధ్వర్యంలో ఐటీసీ యాజమాన్యానికి వినతి పత్రం అందజేయడం జరిగింది. ఈ సందర్భంగా యారం పిచ్చి రెడ్డి మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం జారీ చేసిన నూతన వేతనాల ప్రకారం కార్మికులకు అందవలసిన వేతనాలను ఐటీసీ కర్మాగారంలో కూడా తక్షణమే అమలు చేయవలసిందిగా డిమాండ్ చేస్తున్నామన్నారు.కార్మికులు దైనందిన జీవన వ్యయాల భారంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కాబట్టి తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి , కార్మిక శాఖ మంత్రి గడ్డం వివేక్ తెలంగాణ రాష్ట్ర మినిమమ్ వేజ్ బోర్డు చైర్మన్ శ్రీ జనక్ ప్రసాద్ మార్గదర్శకత్వంలో కృషితో తెలంగాణ ప్రభుత్వం జీవో ఎంఎస్ నెంబర్ .6 (తేదీ: 30-05-2026) ను విడుదల చేసింది. ఈ కమిటీలో భాగస్వామి అయినందుకు తనకు ఎంతో గర్వకారణంగా ఉందన్నారు ఈ ఉత్తర్వుల ప్రకారం, కోడ్ ఆన్ వేజెస్ 2019, షెడ్యూల్-1, ఎంప్లాయ్‌మెంట్ లో పేర్కొన్న నూతన కనీస వేతన రేట్లు 01-06-2026 నుండి అమలులోకి వచ్చాయి. కావున, పాత వేతన నోటిఫికేషన్లు రద్దయినందున, ప్రభుత్వం కల్పించిన ఈ కొత్త వేతన సౌకర్యాన్ని ఐటిసి లిమిటెడ్- పి ఎస్ పి డి, భద్రాచలం యూనిట్‌లోని బదిలీ, కాంట్రాక్ట్ కార్మికులకు తక్షణమే




వర్తింపజేయవలసిందిగా కోరుతున్నాము అన్నారు.అలాగే, కార్మికుల శ్రమకు తగిన న్యాయమైన వేతనాలు, ఇతర చట్టబద్ధ సౌకర్యాలు కూడా అందించవలసిందిగా విజచేస్తున్నాము. ఈ కార్యక్రమంలో ఐ ఎన్ టి యు సి ఐటిసి విభాగం అధ్యక్షులు గోనే రామారావు కార్యవర్గ సభ్యులు కార్యకర్తలు కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

# బీరంగూడ డివిజన్‌లో నవ్య ప్రైడ్ అపార్ట్మెంట్ నీటిలో మునిగిన సెల్లార్

### బీఆర్ఎస్ నాయకులు ఐలాపూర్ మాణిక్ యాదవ్

### సంఘటనా స్థలానికి వెళ్లి సహాయక చర్యలను పర్యవేక్షించారు.

**అమీన్పూర్, హైదరాబాద్ పల్స్ న్యూస్, జూన్ 23 :** రాత్రి కురిసిన భారీ వర్షం కారణంగా బీరంగూడ డివిజన్ పరిధిలోని నవ్య ప్రైడ్ అపార్ట్మెంట్ వద్ద భారీగా వర్షపు నీరు చేరి అపార్ట్మెంట్ సెల్లార్ పూర్తిగా మునిగిపోయింది. సెల్లార్‌లో పార్క్ చేసిన 20కి పైగా ద్విచక్ర వాహనాలు, పలువురు నివాసితుల కార్లు నీటిలో మునిగిపోవడంతో స్థానికులు తీవ్ర ఆందోళనకు గురయ్యారు.విషయం తెలుసుకున్న బీఆర్ఎస్ నాయకులు ఐలాపూర్ మాణిక్ యాదవ్ గారు వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని పరిశీలించారు. అపార్ట్మెంట్ వాసులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. బాధితులకు ధైర్యం చెబుతూ, అవసరమైన సహాయక చర్యలు అందించేందుకు తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు.అలాగే సంబంధిత అధికారులతో మాట్లాడి నీటిని వేగంగా తొలగించే చర్యలు చేపట్టాలని, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని సూచించారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా డ్రైనేజీ వ్యవస్థలను మెరుగుపరచడం, వర్షపు నీరు నిల్వ కాకుండా చర్యలు తీసుకోవాలని అధికారుల దృష్టికి తీసుకెళ్లారు.ఈ సందర్భంగా ఐలాపూర్ మాణిక్ యాదవ్ గారు ప్రజలకు పలు సూచనలు చేశారు. వర్షాకాలంలో అవసరం లేకపోతే సెల్లార్ ప్రాంతాల్లో వాహనాలను పార్క్ చేయకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, భారీ వర్షాల సమయంలో లోతట్టు ప్రాంతాల్లో నివసించే వారు మరింత అప్రమత్తంగా ఉండాలని సూచించారు.అదేవిధంగా విద్యుత్ స్తంభాలు, తెగిపోయిన విద్యుత్ వైర్లు, నీటిలో



మునిగిన ఎలక్ట్రిక్ పరికరాలకు దూరంగా ఉండాలని, పిల్లలను నీరు నిలిచిన ప్రాంతాల్లో ఆడనివ్వకూడదని కోరారు. డ్రైనేజీ మ్యాన్‌హోల్స్, కాలువలు, నీరు నిలిచిన రోడ్ల వద్ద అత్యంత జాగ్రత్తగా వ్యవహరించాలని సూచించారు. ఏదైనా అత్యవసర పరిస్థితి ఎదురైతే వెంటనే సంబంధిత అధికారులకు సమాచారం ఇవ్వాలని, ప్రజల భద్రతే అందరికీ ముఖ్యమని ఆయన పేర్కొన్నారు. వర్షాకాలంలో ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉంటూ తమ కుటుంబ సభ్యుల భద్రతపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఆయన కోరారు.

# త్రిబుల్ ఐటీ విద్యార్థిని చికిత్సకు పూర్తి సహాయం అందించాలి: మహారెడ్డి భూపాల్ రెడ్డి

**హైదరాబాద్ పల్స్ న్యూస్, జూన్ 23, నారాయణఖేడ్ :** బాసర త్రిబుల్ ఐటీలో విద్యనభ్యసిస్తున్న మనూర్ మండలం రాయిపల్లి గ్రామానికి చెందిన ఇస్మాయిల్ కుమార్తె అస్మిత ప్రమాదవశాత్తు భవనం పై నుంచి కిందపడటంతో తీవ్రంగా గాయపడి హైదరాబాద్‌లో చికిత్స పొందుతున్న విషయం తెలుసుకున్న నారాయణఖేడ్ మాజీ ఎమ్మెల్యే మహారెడ్డి భూపాల్ రెడ్డి ఆసుపత్రికి వెళ్లి



ఆమెను పరామర్శించారు. విద్యార్థిని ఆరోగ్య పరిస్థితిని వైద్యులు, కుటుంబ సభ్యులను అడిగి తెలుసుకున్న ఆయన, నిరుపేద కుటుంబానికి చెందిన అస్మిత ఎంతో కష్టపడి చదివి త్రిబుల్ ఐటీలో సీటు సాధించిందని, అలాంటి విద్యార్థిని ప్రమాదానికి గురికావడం బాధాకరమని అన్నారు. ఆమెకు అవసరమైన పూర్తి వైద్య ఖర్చులను రాష్ట్ర ప్రభుత్వమే భరించాలని, కుటుంబం ఎదుర్కొంటున్న ఆర్థిక ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని ప్రత్యేక ఆర్థిక సహాయం అందించడంతో పాటు కుటుంబ సభ్యుల్లో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం కల్పించి ఆదుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అలాగే ప్రజా ప్రతినిధులు, అధికారులు స్పందించి అస్మితకు అత్యుత్తమ వైద్యం అందేలా చర్యలు తీసుకోవాలని కోరుతూ, ఈ క్లిష్ట సమయంలో బాధిత కుటుంబానికి అన్ని విధాలా అండగా ఉంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఫిరోజ్, కుటుంబ సభ్యులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొని అస్మిత త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.

# రైతు సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలి

### తహసీల్దార్‌కు తెలంగాణ రైతు సంఘం వినతిపత్రం



**హైదరాబాద్ పల్స్, జూన్ 23, మహబూబాబాద్ జిల్లా ప్రతినిధి:** రైతులు ఎదుర్కొంటున్న పలు సమస్యల పరిష్కారం కోసం తెలంగాణ రైతు సంఘం మహబూబాబాద్ జిల్లా డోర్నకల్ మండల కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు బొబ్బ వెంకట్ రెడ్డి మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతులకు ఇచ్చిన హామీల అమలులో విఫలమయ్యాయని విమర్శించారు. ప్రస్తుతం ఖరీఫ్ సీజన్ ప్రారంభమైన నేపథ్యంలో మార్కెట్‌లో కల్తీ విత్తనాలు, నాసిరకం ఎరువులు, పురుగుమందుల విక్రయాలను అరికట్టాలని ఆయన డిమాండ్ చేశారు. రైతులకు బ్యాంకుల ద్వారా స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ ప్రకారం పంట రుణాలు సకాలంలో అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు. యాసంగి, వానాకాలం రైతు భరోసా నిధులను వెంటనే విడుదల చేయాలని, వ్యవసాయ రంగంపై భారం మోపుతున్న విధానాలను ఉపసంహరించుకోవాలని ప్రభుత్వాలను కోరారు. అదేవిధంగా రైతులకు ఇబ్బందిగా మారిన యూరియా యాప్ విధానాన్ని రద్దు చేయాలని, కేంద్ర ప్రభుత్వం పెంచిన పోటాష్, భాస్వరం, కాంప్లెక్స్ ఎరువుల ధరలను తగ్గించాలని డిమాండ్ చేశారు. రైతుల సంక్షేమం కోసం ప్రభుత్వాలు తక్షణ చర్యలు చేపట్టాలని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో దాసరి మల్లేశం, మాచర్ల సైదులు, బరిగెల దుర్గయ్య, పొన్నం శ్రీనివాస్, పుట్ట శ్రీనివాస్, పేరబోయిన నాగరాజు, ఎస్. రాజేందర్ తదితర రైతు నాయకులు, రైతులు పాల్గొన్నారు.

# లక్ష్మక్కపల్లి గ్రామంలో బిఆర్ఎస్ నాయకులు కాంగ్రెస్‌లో చేరిక....

**హైదరాబాద్ పల్స్ న్యూస్, జూన్ 23, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి :** రాజాపేట మండలం లక్ష్మక్కపల్లి గ్రామ బిఆర్ఎస్ గ్రామ శాఖ అధ్యక్షులు



గిరాజ్ మహేష్ తన అనుచరులతో కలిసి కాంగ్రెస్ పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. గిరాజ్ మహేష్ కు కాంగ్రెస్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించిన రాజపేట కాంగ్రెస్ మండల అధ్యక్షుడు నమిలే మహేందర్ గౌడ్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది, ఈ సందర్భంగా గిరాజ్ మహేష్ మాట్లాడుతూ... రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రజా సంక్షేమ పథకాలకు ఆకర్షితులై, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే, డిసిసి అధ్యక్షులు బీర్ల ఐలయ్య నాయకత్వాన్ని గుర్తించి కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నానని తెలిపారు. కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేసేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర, జిల్లా, నియోజకవర్గ, మండల, గ్రామ స్థాయి నాయకులు, కార్యకర్తలు తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# పట్టణ స్థానిక సంస్థలకు కంపోస్టింగ్‌పై శిక్షణ....



**హైదరాబాద్ పల్స్ న్యూస్, జూన్ 23, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి :** భువనగిరి పట్టణంలో స్థానిక మున్సిపల్ రిసోర్స్ పార్క్ డంపింగ్ యార్డ్ యందు చైర్ పర్సన్ శ్రీమతి తంగళ్ళపల్లి శ్రీవాణి రవికుమార్ ఆధ్వర్యంలో పట్టణ స్థానిక సంస్థలకు కంపోస్టింగ్‌పై శిక్షణ కార్యక్రమం భువనగిరిలో నిర్వహించడం జరిగింది. ఈ శిక్షణా కార్యక్రమనికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన శ్రీమతి హేమలత కంపోస్ట్ డెవలప్మెంట్ ఆఫీసర్ మరియు నోడల్ అధికారి ఆధ్వర్యంలో రాష్ట్ర ఆన్-సైట్ కంపోస్టింగ్ మరియు పట్టణ హరితీకరణ ప్రయత్నాలలో భాగంగా, క్షేత్రస్థాయి అమలు బృందాలకు సాంకేతిక మార్గదర్శకత్వం అందించడానికి శిక్షణా కార్యక్రమాలను నిర్వహించడం జరుగుతుందని, ఈ నేపథ్యంలో పట్టణ స్థానిక సంస్థల (యు.ఎల్.బి.ఎస్), మోత్కూరు, చౌటుప్పల్, ఆలేరు, పోచంపల్లి, యాదగిరిగుట్ట, స్టేషన్ ఘన్పూర్, జనగామ, జిడబ్ల్యూఎంసి ల నుండి మున్సిపల్ కమిషనర్లు, నామినేట్ చేయబడిన నోడల్ అధికారులు మరియు 2-3 మంది ఇతర పారిశుద్ధ్య సిబ్బందితో కలిసి ఈ శిక్షణా కార్యక్రమంలో పాల్గొనడం జరిగింది. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ చంద్ర ప్రకాష్ రెడ్డి జిల్లాలోని అన్ని పురపాలక సంఘ కమిషనర్లు, శానిటరీ ఇన్స్ పెక్టర్లు, శానిటరీ జవాన్లు, శానిటేషన్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# మాదకద్రవ్యాల దుర్వినియోగంపై విద్యార్థులకు అవగాహన....

**డ్రగ్స్ వాడిన, రవాణా చేసిన చట్టపరమైన శిక్షలు, చర్యలు...**

**రాజపేట ఎస్ఐ లింగారెడ్డి**



**హైదరాబాద్ పల్స్ న్యూస్, జూన్ 23, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి :** జూన్ 26న మాదకద్రవ్యాల దుర్వినియోగం మరియు అక్రమ రవాణాకు వ్యతిరేకంగా అంతర్జాతీయ దినోత్సవం యాక్షన్ ప్లాన్ సందర్భంగా మంగళవారం రెండవ రోజు రాజపేట ఎస్ఐ లింగారెడ్డి మరియు పోలీస్ సిబ్బందితో రాజపేట మండలంలోని కుర్రారం జెడ్పిహెచ్ఎస్ పాటశాలలో మండల విద్యాధికారి (ఎంఇఓ) చందా రమేష్, స్కూల్ ప్రధానోపాధ్యాయులు మరియు ఉపాధ్యాయులతో పాటు గ్రామ సర్పంచ్ మరియు గ్రామస్థులతో కలసి విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించి విద్యార్థులతో యాంటీ డ్రగ్ కమిటీ ఏర్పాటు చేసి, విద్యార్థులతో డ్రగ్ మహమ్మారి పై నాటక ప్రదర్శన మరియు డ్రగ్ వల్ల విద్యార్థుల జీవితం పైన ఎలాంటి ప్రభావం చూపిస్తుందో పోస్టర్ లతో విద్యార్థులకి తెలియచేస్తూ మాదక ద్రవ్యాలు అంటే ఏమిటి, మాదకద్రవ్యాల్లో రకాలు, మరియు డ్రగ్స్ ను ఏ విధంగా వాడుతారు, అట్టి డ్రగ్స్ శరీరం పైన ఎలాంటి ప్రభావం చూపుతోంది మరియు ప్రవర్తనలో మార్పులు, శారీరక లక్షణాలు మరియు డ్రగ్స్ కొనడం, వాడటం వల్ల చట్టపరమైన శిక్షలు గురించి తెలియచేస్తూ అవగాహన కార్యక్రమం నిర్వహించడం జరిగింది.

# రాంగోపాల్ పేట్ డివిజన్లో 40 వ ప్రపంచ ఓలంపిక్ డే పరుగు

**మాజీ కార్పొరేటర్ చీరా సుచిత్ర శ్రీకాంత్ ఆధ్వర్యంలో ప్రారంభం**

**రాంగోపాల్ పేట్, జూన్ 23,హైదరాబాద్ పల్స్ ప్రతినిధి :**



40 వ ప్రపంచ ఓలంపిక్ కమిటి బలంపిక్ భారత ఒలంపిక్ సంఘం మరియు తెలంగాణ సంఘం రాష్ట్ర క్రీడ సాధికారక సంస్థ విద్యాశాఖ పోలీస్ శాఖ పురపాలక శాఖ ఆధ్వర్యంలో ప్రపంచ ఒలంపిక్ డే పరుగు సికింద్రాబాద్ గాంధీ విగ్రహం దగ్గర నుండి లాల్ బహుదూర్ శాస్త్రి స్టేడియం వరకు ఒలంపిక్ డే రన్ ను రాంగోపాల్ పేట్ మాజీ కార్పొరేటర్ చీర సుచిత్ర శ్రీకాంత్ ప్రారంభించారు..ఈ 40 వ ఓలంపిక్ రన్ కి చైర్మన్ గా చీరాల సత్యనారాయణ పాల్గొన్నారు.ఈ కార్యక్రమంలో కన్వీనర్ గా ఎస్.కుమార్ ఎ.ప్రతాపరెడ్డి,కో కన్వీనర్ గా బాక్సింగ్ కోచ్ కే.కృష్ణ పాల్గొన్నారు.ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా ఓలంపిక్ వాటర్ స్పోర్ట్స్ ధ్యాన్ చంద్ అవార్డు గ్రహీత మంజీత్ సింగ్ పాల్గొని క్రీడాజ్యోతిని వెలిగించి మిగతా క్రీడాకారులతో కలిసి ఒలంపిక్ రన్ లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో క్రీడాకారులు విద్యార్థులు తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# రైతు వేదికలో విత్తన మేళా కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే ఎ. సంజీవరెడ్డి

**హైదరాబాద్ పల్స్ న్యూస్, జూన్ 23, నారాయణఖేడ్ :**



రైతుల సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం పనిచేస్తోందని, అందులో భాగంగానే రైతు ముంగిట్లోకి నాణ్యమైన విత్తనాలను తీసుకువచ్చి పంపిణీ చేస్తున్నామని నారాయణఖేడ్ శాసనసభ్యులు డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి అన్నారు. మంగళవారం నాడు నారాయణఖేడ్ మండల పరిధిలోని ఆకుల లింగాపూర్ గ్రామంలో గల రైతు వేదికలో “రైతు ముంగిట్లో నాణ్యమైన విత్తనాలు” పంపిణీ కార్యక్రమం (విత్తన మేళా) ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే రైతులకు నాణ్యమైన విత్తనాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి మాట్లాడుతూ... రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా, నాణ్యమైన విత్తనాలను నేరుగా వారి వద్దకే చేరవేసేందుకు ప్రభుత్వం ఈ విత్తన మేళాను ఏర్పాటు చేసిందని తెలిపారు. ఈ సువర్ణ అవకాశాన్ని నియోజకవర్గంలోని రైతులందరూ సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.వ్యవసాయ అధికారుల సలహాలు, సూచనలు పాటిస్తూ లాభసాటి పంటల వైపు మొగ్గు చూపాలని, తద్వారా అధిక దిగుబడులు సాధించవచ్చని ఆయన ఆకాంక్షించారు. రైతుల అభ్యున్నతి కోసం ప్రభుత్వం ఎల్లప్పుడూ అండగా ఉంటుందని ఈ సందర్భంగా ఎమ్మెల్యే స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో నారాయణఖేడ్ వ్యవసాయ అధికారి నూతన్ కుమార్ గ్రామ సర్పంచ్ రుక్మిణి హనుమండ్లు, తాహెర్ అలీ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, పండరి రెడ్డి మాజీ ఎంపీటీసీ, శివరాజ్ మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు, సర్దార్ నాయక్ సర్పంచ్, పండరి, స్థానిక ప్రజాప్రతినిధులు, వ్యవసాయ శాఖ అధికారులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు మరియు ఆకుల లింగాపూర్ పరిసర ప్రాంతాల రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# అంతర్రాష్ట్ర నకిలీ పత్తి విత్తనాల ముఠాను పట్టుకున్న తుర్కపల్లి పోలీసులు

**పి.శ్రీనివాస్ నాయుడు, ఎస్.డి.పి.ఓ, యాదాద్రి డివిజన్**

**హైదరాబాద్ పల్స్ న్యూస్, జూన్ 23, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి : యదాద్రి** భువంగిరి జిల్లా తుర్కాపల్లి, పోలీసులు స్వాధీనం: నకిలీ బిజి-2 పత్తి విత్తనాలు 150 కిలోలు మరియు 01 నిందితుడు అరెస్ట్‌క్రైమ్ నం.120/2026, యు/ఎస్ 318(4), 223 బిఎన్ఎస్, సెక్షన్ 19 ఆర్/డబ్ల్యూ 7 విత్తనాలు చట్టం,12(2)తెలంగాణ పత్తి విత్తనాల చట్టం-2007, 15(1) పర్యావరణ పరిరక్షణ చట్టం, (ఇపిఎ), తుర్కపల్లి పోలీస్ స్టేషన్.



**నిందితుల వివరాలు**

ఎ1: దొండపాటి మల్లికార్జునరావు, తండ్రి వెంకటేశ్వరరావు, వయస్సు 36 సంవత్సరాలు, కేశనపల్లి గ్రామం, దాచేపల్లి మండలం, గుంటూరు జిల్లా, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం.

ఎ2 : శంకర్, తండ్రి వెంకటరమణ, బి. కొత్తకోట, చిత్తూరు జిల్లా, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం (పరారీలో ఉన్నాడు)

స్వాధీనం చేసుకున్న విత్తనాలు

1. “బిల్లా బిజి-2 999” పేరుతో ఉన్న నకిలీ పత్తి విత్తనాల ప్యాకెట్లు సుమారు 70 కిలోలు (2 సంచుల్లో).
2. విడిగా ఉన్న నకిలీ/కల్తీ పత్తి విత్తనాలు సుమారు 80 కిలోలు (3 సంచుల్లో).

**మొత్తం విలువ సుమారు రూ.10,00,000/-**

విశ్వసనీయ సమాచారంపై తుర్కపల్లి పోలీసులు వ్యవసాయ శాఖ అధికారులతో కలిసి తుర్కపల్లి బస్ స్టాండ్ ముందర దొండపాటి మల్లికార్జునరావుకాను వ్యక్తి ని అదుపులోకి తీసుకున్నారు. అతను గుంటూరు నుండి సిద్ధిపేటకు నిషేధిత బిజి-2 పత్తి విత్తనాలను అక్రమంగా తరలిస్తూ విక్రయించేందుకు ప్రయత్నిస్తున్నట్లు గుర్తించారు.విచారణలో ఎ1 దొండపాటి మల్లికార్జునరావు, చిత్తూరు జిల్లాకు చెందిన ఎ2 శంకర్‌తో కలిసి తెలంగాణ రాష్ట్రంలో అక్రమంగా నకిలీ బిజి-2 పత్తి విత్తనాలను కొనుగోలు చేసి, రవాణా చేసి, విక్రయించేందుకు కుట్ర పన్నినట్లు వెల్లడైంది. పోలీసుల ప్రశ్నించగా, తాను రైతులకు అధిక దిగుబడి వస్తుందని, మంచి పంట ఉత్పత్తి కలుగుతుందని తప్పుడు ప్రచారం చేస్తూ నకిలీ పత్తి విత్తనాలను విక్రయించేందుకు తీసుకువెళ్తున్నట్లు ఒప్పుకున్నాడు. మొత్తం ఐదు సంచుల్లో ఉన్న క్రింది విత్తనాలను స్వాధీనం చేసుకున్నారు:

-“బిల్లా బిజి -2 999” పేరుతో ఉన్న నకిలీ పత్తి విత్తనాల ప్యాకెట్లు - 70 కిలోలు (2 సంచులు)

-విడిగా ఉన్న నకిలీ/కల్తీ పత్తి విత్తనాలు - 80 కిలోలు (3 సంచులు)

స్వాధీనం చేసిన విత్తనాల నిల్వ, రవాణా మరియు విక్రయాలకు సంబంధించి నిందితుడు ఎటువంటి చెల్లుబాటు అయ్యే లైసెన్స్, బిల్లులు, ఇన్వాయిస్‌లు, రవాణా అనుమతులు, స్టాక్ రిజిస్టర్లు లేదా అధికార పత్రాలను సమర్పించలేకపోయాడు. పరారీలో ఉన్న ఎ2 శంకర్‌ను పట్టుకునేందుకు ప్రత్యేక చర్యలు కొనసాగుతున్నాయి. ఇలాంటి నిషేధిత మరియు నకిలీ పత్తి విత్తనాల వినియోగం వల్ల విత్తనాల మొలక శాతం తగ్గిపోవడం, పంటలు విఫలమవడం మరియు రైతులు తీవ్ర ఆర్థిక నష్టాలు చవిచూడాల్సిన పరిస్థితులు ఏర్పడవచ్చు. ఈ నకిలీ విత్తనాలు నిర్దేశిత నాణ్యత ప్రమాణాలకు అనుగుణంగా ఉండవు మరియు వ్యవసాయ ఉత్పాదకతపై ప్రతికూల ప్రభావం చూపుతాయి. ఇలాంటి విత్తనాల నిరంతర వినియోగం భూసారాన్ని దెబ్బతీయడమే కాకుండా నేల కాలుష్యానికి కూడా దారితీయవచ్చు. రైతులు అదనంగా పురుగుమందులు, ఎరువులు మరియు తిరిగి విత్తడం కోసం అధిక ఖర్చు చేయాల్సి రావడంతో సాగు వ్యయం పెరుగుతుంది. ఈ విధమైన అక్రమ కార్యకలాపాలు రైతు సమాజానికి మరియు వ్యవసాయ రంగానికి తీవ్రమైన ముప్పుగా మారుతున్నాయి. యాదాద్రి భువనగిరి జిల్లా పోలీసులు రైతులకు భారీ ఆర్థిక నష్టాలు కలిగించే నకిలీ విత్తనాల వ్యాపారాన్ని అరికట్టేందుకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటున్నారు. నకిలీ విత్తనాల తయారీ, రవాణా మరియు విక్రయాల్లో పాల్గొంటున్న ముఠాలను గుర్తించి నిర్మూలించేందుకు నిరంతర చర్యలు కొనసాగుతున్నాయి. ఈ అక్రమ కార్యకలాపాలలో పాల్గొనే ప్రతి ఒక్కరిపై కఠినమైన చట్టపరమైన చర్యలు తీసుకోబడతాయి. నకిలీ విత్తనాల నిల్వ, విక్రయం లేదా రవాణా గురించి విశ్వసనీయ సమాచారం తెలిసిన రైతులు మరియు ప్రజలు పోలీసులకు సమాచారం అందించి సహకరించాలని విజ్ఞప్తి చేస్తున్నాము. రైతుల ప్రయోజనాల పరిరక్షణ కోసం తగిన చర్యలు తీసుకోబడతాయి. ఈ ఆపరేషన్‌ను యాదాద్రి భువనగిరి జిల్లా పోలీస్ సూపరింటెండెంట్ అక్షాంశ్ యాదవ్, ఎస్పీ ఐపిఎస్ ప్రత్యక్ష పర్యవేక్షణలో, అదనపు ఎస్పీ చి. లక్ష్మీనారాయణ సహకారంతో నిర్వహించారు. అలాగే పి.శ్రీనివాస్ నాయుడు, ఎస్.డి.పి.ఓ, యాదాద్రి డివిజన్, ఎం. శంకర్, ఇన్‌స్పెక్టర్ ఆఫ్ పోలీస్, యాదగిరిగుట్ట రూరల్ సర్కిల్, శ్రీ మొహమ్మద్ తకియుద్దీన్, ఎస్ఐ, తుర్కపల్లి పోలీస్ స్టేషన్, శ్రీమతి కె.ఉమ, మండల వ్యవసాయ అధికారి, తుర్కపల్లి మండలం, మరియు తుర్కపల్లి పోలీస్ స్టేషన్ సిబ్బంది మార్గదర్శకత్వంలో ఈ దాడి నిర్వహించబడింది.

## మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండి

# ఉజ్వల భవిష్యత్తును నిర్మించుకోవాలి

**జిల్లా ఎస్పీ రోహిత్ రాజు ఐపిఎస్**

**పాల్వంచ గురుకుల పాఠశాలలో మాదకద్రవ్యాల నిర్మూలనపై అవగాహన సదస్సు**

హైదరాబాద్ పల్స్ న్యూస్, జూన్ 23, భద్రాద్రి జిల్లా ప్రతినిధి :



భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచ పోలీస్ స్టేషన్ పరిధిలోని లక్ష్మీదేవిపల్లి గ్రామంలో గల బాలుర గురుకుల పాఠశాలలో మాదక ద్రవ్యాల నిర్మూలనపై అవగాహన సదస్సు ఏర్పాటు చేయడం జరిగింది. ఈ కార్యక్రమానికి హాజరైన జిల్లా ఎస్పి రోహిత్ రాజు పాఠశాల విద్యార్థుల నుండి గౌరవ వందనాన్ని స్వీకరించి,అనంతరం వన మహోత్సవంలో భాగంగా పాఠశాల పరిధిలో మొక్కలు నాటారు. అనంతరం మాదక ద్రవ్యాల నిర్మూలన అవగాహన కార్యక్రమంలో పాల్గొని ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ యువత దేశానికి వెన్నుముక లాంటివారు, క్షణకాలపు ఆనందం కోసం మత్తు పదార్థాల వైపు ఆకర్షితులై, తమ బంగారు భవిష్యత్తును, తల్లిదండ్రుల ఆశలను చేతులారా నాశనం చేసుకుంటున్నారని, మాదక ద్రవ్యాల వల్ల శారీరకంగా మానసికంగా ఆరోగ్యం దెబ్బతినడమే కాకుండా కుటుంబాలు రోడ్డున పడే పరిస్థితి ఏర్పడుతుందని తెలియజేశారు. విద్యార్థులు స్నేహితుల ఎంపికలో జాగ్రత్తగా ఉండాలని, వైజ్ఞానిక పరిజ్ఞానం పిల్లలకు అవసరమని, సినిమాలలోని మంచిని గ్రహించి చెడుని వదిలేయాలని, చదువుల్లో లేదా వ్యక్తిగత జీవితంలో ఒత్తిడి నుండి ఉపశమనానికై క్రీడలపై ఆసక్తి చూపాలని, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పిల్లల ప్రవర్తన కదలికలను గమనిస్తూ ఉండాలని సూచనలు చేశారు.అనంతరం సైబర్ నేరాల గురించి మాట్లాడుతూ అత్యాశకు పోయి త్వరితగతిన డబ్బును సంపాదించాలనే ఆలోచనతో చాలామంది సైబర్ నేరాల బారిన పడి కష్టపడి సంపాదించిన నగదును కోల్పోతున్నారని, చదువుకున్నవారే ఎక్కువమంది సైబర్ నేరాలు బారిన పడుతున్నారని తెలిపారు.ఓటీపి ట్రాప్,ఆన్లైన్ ట్రేడింగ్,సోషల్ మీడియాల ద్వారా ప్రస్తుతం జరుగుతున్న సైబర్ నేరాల గురించి వివరించారు.విద్యార్థినులకు సాంకేతిక పరిజ్ఞానంపై అవగాహన కలిగి ఉండాలని, సోషల్ మీడియాలో వ్యక్తిగత సమాచారాన్ని గోప్యంగా ఉంచాలని, మహిళల భద్రతపై పలు సూచనలు చేశారు. మహిళలకు, విద్యార్థినులకు రక్షణగా జిల్లాలో షీ టీమ్స్ పనిచేస్తున్నాయని, అత్యవసర సమయాల్లో 1098 టోల్ ఫ్రీ నెంబర్ కు కాల్ చేయాలని సూచనలు చేశారు.అనంతర రోడ్డు భద్రతా నియమాలను పాటించడంలో స్వీయ క్రమశిక్షణ కలిగి ఉంటే చాలావరకు రోడ్డు ప్రమాదాలను అరికట్టవచ్చని, హెల్మెట్ వినియోగం, సీటు బెల్ట్ ప్రాధాన్యత, డిఫెన్సివ్ డ్రైవింగ్ నియమాల గురించి వివరించారు. డ్రంక్ అండ్ డ్రైవ్, ర్యాష్ డ్రైవింగ్, సెల్‌ఫోన్ డ్రైవింగ్, రాంగ్ రూట్, సిగ్నల్ జంపింగ్, ఓవర్ లోడ్ వలన కలిగే ప్రమాదాల గురించి వివరించారు. సుమారు 300 మందికి పైగా విద్యార్థులు పాల్గొన్న ఈ కార్యక్రమంలో డ్రగ్స్ రహిత సమాజమే లక్ష్యంగా ప్రతిజ్ఞ చేశారు.ఈ కార్యక్రమంలో పాల్వంచ డిఎస్పి ఆర్. సతీష్ కుమార్, ఎస్బిఐ ఇన్స్పెక్టర్ శ్రీనివాస్, పాల్వంచ సీఐ సతీష్, ఎక్సైజ్ సీఐ ప్రసాద్, పోలీసు అధికారులు,పాఠశాల కళాశాల, అధ్యాపకులు, ఉపాధ్యాయులు సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఐఎండీ చల్లని కబురు.. తెలంగాణతో సహా

# ఆ రాష్ట్రాలను తాకిన నైరుతి రుతుపవనాలు

**హైదరాబాద్ పల్స్ న్యూస్, జూన్ 23, సెంట్రల్ బ్యూరో:**
భానుడి భగభగలు, ఉక్కపోతతో అల్లాడుతున్న ప్రజలకు భారత వాతావరణ శాఖ ఉపశమనం కలిగించే వార్త చెప్పింది. దేశంలో నైరుతి రుతుపవనాలు చురుగ్గా కదులుతున్నాయని వెల్లడించింది.

**రాష్ట్రాలకు రుతుపవనాల విస్తరణ:**
జూన్ 23 నాటికి తెలంగాణ, మహారాష్ట్ర (ముంబై సహా), ఒడిశాలోని మిగిలిన ప్రాంతాలతో పాటు ఛత్తీస్‌గఢ్, జార్ఖండ్, బీహార్ రాష్ట్రాల్లోని మరికొన్ని ప్రాంతాలకు రుతుపవనాలు విస్తరించాయి. రుతుపవనాల ఉత్తర పరిమితి ప్రస్తుతం నిజామాబాద్, పుణె, అలీబాగ్, దంతెవాడ ప్రాంతాల మీదుగా కొనసాగుతోంది. రానున్న రోజుల్లో.. మధ్య అరేబియా సముద్రంలో ఏర్పడిన అనుకూల పరిస్థితుల వల్ల,




రాబోయే 2-3 రోజుల్లో గుజరాత్, మధ్యప్రదేశ్‌తో పాటు మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్‌లలోని మరిన్ని ప్రాంతాలకు, ఆ తర్వాత 3-4 రోజుల్లో ఉత్తరప్రదేశ్‌కు ఇవి వేగంగా విస్తరించే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు. రుతుపవనాల రాక నేపథ్యంలో తీర, లోతట్టు ప్రాంతాలకు ఐఎండీ అలర్ట్ జారీ చేసింది. ముంబై, రాయ్‌గఢ్ ప్రాంతాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది. గంటకు 30 కి.మీ వేగంతో ఈదురు గాలులు వీస్తాయని హెచ్చరించింది.

**మత్స్యకారులకు అలెర్ట్**
సముద్రం అల్లకల్లోలంగా మారే ప్రమాదం ఉన్నందున, దక్షిణ మహారాష్ట్ర - గోవా తీర ప్రాంతాల్లోని మత్స్యకారులు వేటకు వెళ్లొద్దని వాతావరణ శాఖ స్పష్టం చేసింది. భారీ వర్షాల కారణంగా ఆకస్మిక వరదలు వచ్చి రోడ్డు, రైలు, విమాన రాకపోకలకు అంతరాయం కలిగే ప్రమాదం ఉంది. ప్రజలు నిర్మాణాలకు దూరంగా ఉండాలని, ట్రాఫిక్ పోలీసుల సూచనలు పాటిస్తూ సురక్షిత ప్రాంతాల్లో ఉండాలని ఐఎండీ సూచించింది.

# విత్తన మేళాతో రైతులకు భరోసా

**డోర్నకల్ మండలంలో వ్యవసాయ శాఖ ప్రత్యేక కార్యక్రమం ప్రారంభం**

**నాణ్యమైన విత్తనాల పంపిణీతో పాటు ప్రత్యామ్నాయ పంటల సాగుపై అవగాహన**

**హైదరాబాద్ పల్స్, జూన్ 23, మహబూబాబాద్ జిల్లా ప్రతినిధి :**
ఖరీఫ్ సాగు సీజన్‌ను దృష్టిలో ఉంచుకుని రైతులకు నాణ్యమైన విత్తనాలు అందుబాటులోకి తీసుకురావడం, ప్రత్యామ్నాయ పంటల సాగును ప్రోత్సహించడం లక్ష్యంగా డోర్నకల్ మండలంలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో విత్తన మేళా కార్యక్రమాన్ని ఘనంగా ప్రారంభించారు. మండలంలోని అమ్మపాలెం, గొల్లచెర్ల, చిలుకోడు, వెన్నారం రైతు వేదికల్లో ఒకేసారి ప్రారంభమైన ఈ కార్యక్రమానికి రైతుల నుంచి విశేష స్పందన లభించింది. ప్రభుత్వ ఆదేశాల మేరకు నిర్వహిస్తున్న ఈ విత్తన మేళా జూన్ 30 వరకు కొనసాగనుంది. రైతులకు అవసరమైన నాణ్యమైన వరి విత్తనాలతో పాటు కందులు, పెసర్లు, మినుములు, వివిధ రకాల కూరగాయల విత్తనాలను రైతు వేదికల ద్వారా అందుబాటులో ఉంచారు. రైతులు తమకు సమీపంలోని రైతు వేదికల్లో విత్తనాలను కొనుగోలు చేసుకునేలా ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. మంగళవారం ఉదయం నిర్వహించిన రైతునేస్తం కార్యక్రమం ద్వారా విత్తన మేళాను ప్రారంభించారు. కార్యక్రమంలో పాల్గొన్న రైతులు తమ అవసరాలకు అనుగుణంగా విత్తనాలను కొనుగోలు చేసుకోవడంతో పాటు వ్యవసాయ అధికారుల నుంచి సాగు పద్ధతులపై సూచనలు పొందారు. మండల కేంద్రంలోని అమ్మపాలెం రైతు వేదికలో జరిగిన కార్యక్రమంలో డోర్నకల్ మున్సిపల్ చైర్మన్ కొండేటి రాజకుమారి హరినాథ్,వైస్ చైర్‌పర్సన్ లావణ్య శ్రీనివాస్, స్థానిక ప్రజాప్రతినిధులు, సర్పంచులు, ఉపసర్పంచులు పాల్గొన్నారు. అదేవిధంగా ఇతర రైతు వేదికల్లో ప్రజాప్రతినిధులు, ఆత్మ కమిటీ సభ్యులు, వ్యవసాయ విస్తరణ అధికారులు (ఏఈఓలు), విత్తన డీలర్లు, రైతులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. ప్రస్తుత ఎల్‌నినో వాతావరణ పరిస్థితుల నేపథ్యంలో రైతులు సంప్రదాయ పంటలతో పాటు అపరాలు, కూరగాయల సాగుపై కూడా దృష్టి పెట్టాలని వ్యవసాయ అధికారులు సూచించారు. తక్కువ పెట్టుబడితో అధిక ఆదాయం పొందే అవకాశాలు ఉన్న పంటలను సాగు చేయడం ద్వారా రైతులు ఆర్థికంగా మరింత బలోపేతం



కావచ్చని తెలిపారు. రైతులకు నాణ్యమైన విత్తనాలు, సరైన సాంకేతిక సూచనలు అందించడం ద్వారా వ్యవసాయ రంగాన్ని మరింత అభివృద్ధి చేయాలనే లక్ష్యంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు వ్యవసాయ శాఖ అధికారులు పేర్కొన్నారు. విత్తన మేళా ముగిసేలోపు రైతులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## ప్రజా వినతుల పరిష్కారమే లక్ష్యం.. కార్యాచరణ ప్రణాళికపై అధికారులకు ఆదేశాలు

**హైదరాబాద్ పల్స్ న్యూస్, జూన్ 23, సంగారెడ్డి ప్రతినిధి:**
సంగారెడ్డి జిల్లాలో ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక కార్యక్రమాల ద్వారా ప్రజల నుంచి వచ్చిన వినతులు, సమస్యలను సమగ్రంగా విశ్లేషించి వాటి పరిష్కారానికి జిల్లా స్థాయిలో స్పష్టమైన కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని జిల్లాకు ప్రత్యేక అధికారిణిగా నియమితులైన ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ డా. క్రిస్టినా జడ్ చోంగ్తు అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్, వివిధ శాఖల అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆమె మాట్లాడుతూ, ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజా పాలన--ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమాన్ని అన్ని శాఖలు సమన్వయంతో విజయవంతంగా అమలు చేసినందుకు జిల్లా యంత్రాంగాన్ని అభినందించారు. కార్యక్రమం




సందర్భంగా ప్రజల నుంచి అందిన ఫిర్యాదులు, వినతులు, వాటి పరిష్కారానికి తీసుకున్న చర్యలు, సంక్షేమ పథకాల అమలు, ప్రజలకు అందిన ప్రయోజనాలపై సమీక్ష నిర్వహించారు. పెండింగ్‌లో ఉన్న సమస్యలను ప్రాధాన్యత ఆధారంగా గుర్తించి వాటి పరిష్కారానికి తక్షణ చర్యలు చేపట్టాలని, ప్రజల భాగస్వామ్యాన్ని పెంచిన మరియు మంచి ఫలితాలు ఇచ్చిన కార్యక్రమాలను భవిష్యత్తులో మరింత విస్తృతంగా అమలు చేయాలని సూచించారు. గ్రామ, మండల, నియోజకవర్గ స్థాయిలో పనిచేసిన అధికారుల నుంచి ఫీడ్‌బ్యాక్ సేకరించి, శాఖల సమన్వయంతో ప్రజా సమస్యల పరిష్కారానికి మరింత సమర్థవంతమైన కార్యాచరణ రూపొందించాలని తెలిపారు. జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ మాట్లాడుతూ, ప్రజా పాలన--ప్రగతి ప్రణాళికలో గుర్తించిన సమస్యలను వర్గీకరించి వాటి పరిష్కారానికి చర్యలు చేపడుతున్నామని, మిగిలిన సమస్యలకు జిల్లా స్థాయి యాక్షన్ ప్లాన్ రూపొందించి ప్రజలకు మెరుగైన సేవలు అందించే దిశగా కృషి చేస్తున్నామని తెలిపారు. సమావేశంలో అడిషనల్ ఎస్పీ చైతన్య రెడ్డి, నారాయణఖేడ్ సబ్ కలెక్టర్ ఉమాహారతి, వివిధ శాఖల జిల్లా అధికారులు, రెవెన్యూ డివిజనల్ అధికారులు, మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీవోలు తదితరులు పాల్గొన్నారు.

## లంచం తీసుకుంటూ ఏసీబీకి చిక్కిన గాంధీనగర్ ఎస్ఐ




**హైదరాబాద్ పల్స్ న్యూస్, జూన్ 23, తెలంగాణ బ్యూరో :**
స్టేషన్ బెయిల్ మంజూరు చేయడంతో పాటు భవిష్యత్తులో ఎలాంటి వేధింపులు ఉండవంటూ ఓ కేసులో రూ.లక్ష లంచం డిమాండ్ చేసిన గాంధీనగర్ పోలీస్ స్టేషన్ ఎస్ఐని అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అధికారులు రెడ్‌హ్యాండెడ్ గా పట్టుకున్నారు. ఫిర్యాదుదారుడి నుంచి తొలి విడతగా రూ.50 వేల లంచం స్వీకరిస్తుండగా ఏసీబీ అధికారులు వల పన్ని అదుపులోకి తీసుకున్నారు. ఏసీబీ తెలిపిన వివరాల ప్రకారం.. గాంధీనగర్ పోలీస్ స్టేషన్‌లో సబ్ ఇన్‌స్పెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్నవీ నర్సింహులు ఓ కేసులో ఫిర్యాదుదారుడికి స్టేషన్ బెయిల్ మంజూరు చేయడంతో పాటు భవిష్యత్తులో ఇబ్బందులు కలగకుండా చూస్తానంటూ రూ.లక్ష డిమాండ్ చేశారు. దీంతో బాధితుడు ఏసీబీ అధికారులను ఆశ్రయించాడు.ఫిర్యాదు మేరకు పక్కా ప్రణాళిక రూపొందించిన ఏసీబీ సిటీ రేంజ్-1 అధికారులు మంగళవారం సాయంత్రం వలవేసి పట్టుకున్నారు. ఈ క్రమంలో ఎస్ఐ నర్సింహులు ఫిర్యాదుదారుడి నుంచి తొలి విడతగా రూ.50వేల నగదు స్వీకరిస్తుండగా అధికారులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. అనంతరం ఆయన వద్ద నుంచి లంచం మొత్తాన్ని స్వాధీనం చేసుకున్నారు. విధి నిర్వహణలో అధికార దుర్వినియోగానికి పాల్పడి అక్రమ లబ్ధి పొందేందుకు ప్రయత్నించినట్లు ప్రాథమిక విచారణలో తేలినట్లు ఏసీబీ అధికారులు తెలిపారు. నిందితుడిని అరెస్ట్ చేసి నాంపల్లిలోని ప్రత్యేక ఏసీబీ కోర్టు న్యాయమూర్తి ఎదుట హాజరుపర్చనున్నట్లు వెల్లడించారు. కేసుకు సంబంధించిన దర్యాప్తు కొనసాగుతోందని, భద్రతా కారణాల దృష్ట్యా ఫిర్యాదుదారుడి వివరాలను గోప్యంగా ఉంచినట్లు ఏసీబీ పేర్కొంది. ప్రభుత్వ ఉద్యోగులు ఎవరైనా లంచం డిమాండ్ చేసినా వెంటనే ఏసీబీ టోల్‌ఫ్రీ నంబర్ 1064కు సమాచారం అందించాలని ప్రజలకు సూచించింది.

## ఓరియెంటేషన్ శిక్షణ కార్యక్రమంలో పాల్గొన్న చైర్ పర్సన్ తంగళ్ళపల్లి శ్రీవాణి

**హైదరాబాద్ పల్స్ న్యూస్, జూన్ 23, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి :**



హైదరాబాద్, సోమాజిగూడలోని హోటల్ మెర్క్యూర్‌లో కమిషనర్ అండ్ డైరెక్టర్ ఆఫ్ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్, తెలంగాణ తరపున, నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ అర్బన్ మేనేజ్‌మెంట్, హైదరాబాద్ వారు మంగళవారం రోజు మహిళా మేయర్లు, మున్సిపల్ చైర్ పర్సన్ లకు నిర్వహించిన ఒకరోజు ఓరియెంటేషన్ కార్యక్రమములో భువనగిరి మున్సిపల్ చైర్ పర్సన్ శ్రీమతి తంగళ్ళపల్లి శ్రీవాణి రవి కుమార్ పాల్గొనడం జరగింది. ఇట్టి శిక్షణ కార్యక్రమములో పట్టణ పరిపాలన, పాలనా విధానాలు, అభివృద్ధి కార్యక్రమాల అమలుపై సాంకేతిక అవగాహన కల్పించడం ఈ శిక్షణ ముఖ్య ఉద్దేశం అని తెలిపారు. ఇట్టి శిక్షణా కార్యక్రమం తదనంతరం ప్రిన్సిపల్ సెక్రెటరీ డాక్టర్ టికె.శ్రీదేవి, ఐఏఎస్ ని చైర్ పర్సన్ మర్యాదపూర్వకంగా కలిసి భువనగిరి పురపాలక సంఘంలో ఖాళీగా ఉన్న వివిధ టెక్నికల్ పోస్టులను భర్తీ చేయాలని లేదా సంబంధిత అధికారులను మరియు సిబ్బందిని కేటాయించాలని కోరుతూ, పరిపాలనలో మరియు పట్టణ అభివృద్ధిలో ఇబ్బంది జరుగుతుందని వారికి తెలియజేయాగ, వారు సానుకూలంగా స్పందిస్తూ వీలైనంత త్వరలో సమస్యను పరిష్కరిస్తామని తెలియజేయడం జరిగింది.

## లెబనాన్ కాల్పుల విరమణ: భారత్‌కు భారీ ఊరట.. విమాన, చమురు ధరల్లో మార్పులు?

**హైదరాబాద్ పల్స్ న్యూస్, జూన్ 23 :**
లెబనాన్‌లో రాత్రంతా కాల్పుల విరమణ కొనసాగడంతో పశ్చిమ ఆసియాలో ప్రస్తుతం ప్రశాంత వాతావరణం కనిపిస్తోంది. భారత్ విషయానికి వస్తే, విమాన ప్రయాణాలు మరియు గ్లోబల్ ఎనర్జీ మార్కెట్లపై దీని ప్రభావం ఉండటంతో ఈ పరిణామం చాలా కీలకంగా మారింది. ఈ శాంతియుత వాతావరణం వచ్చే 48 గంటల తర్వాత కూడా ఇలాగే కొనసాగుతుందా అని ట్రేడర్లు ఆసక్తిగా గమనిస్తున్నారు. ఇక్కడ పరిస్థితులు కుదుటపడితే భారత ఆర్థిక వ్యవస్థకు మేలు జరగడమే కాకుండా, విదేశాల్లో పనిచేస్తున్న మన భారతీయులకు భద్రత పెరుగుతుంది.ఎయిర్ ఇండియా, ఇండిగో వంటి విమానయాన సంస్థలు పరిస్థితులను నిశితంగా గమనిస్తున్నాయి. నిలిచిపోయిన విమానాలను మళ్లీ ప్రారంభించేందుకు లేదా రీషెడ్యూల్ చేసేందుకు ప్లాన్ చేస్తున్నాయి. గగనతలం సురక్షితంగా మారితే ప్రయాణ సమయం తగ్గడమే కాకుండా, విమాన టికెట్ల ధరలు కూడా తగ్గే అవకాశం ఉంది. ప్రయాణికులు విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ ఇచ్చే అప్‌డేట్స్‌ను ఎప్పటికప్పుడు చూస్తూ ఉండాలి. వచ్చే 48 గంటల్లో చాలా అంతర్జాతీయ విమాన సంస్థలు తమ పాత రూట్లలో సర్వీసులను పునరుద్ధరించే యోచనలో ఉన్నాయి.

**లెబనాన్ కాల్పుల విరమణ: భారత్ విమాన సర్వీసుల అప్‌డేట్స్**
ఈ వార్తతో సరఫరా ఆందోళనలు కాస్త తగ్గడంతో, అంతర్జాతీయ మార్కెట్‌లో బ్రెంట్ క్రూడ్ ధరల్లో మార్పులు కనిపిస్తున్నాయి. పశ్చిమ ఆసియాలో స్థిరత్వం ఉంటే డాలర్‌తో పోలిస్తే రూపాయి బలోపేతం అవుతుంది. ముడి చమురు ధరలు తగ్గితే భారత్ దిగుమతి బిల్లుల భారం తగ్గుతుంది. ఇది దేశవ్యాప్తంగా ఇంధన ధరల విషయంలో సామాన్యులకు పెద్ద ఊరటనిచ్చే అంశం.


**ముడి చమురు ధరలు, రూపాయి విలువపై ప్రభావం**
డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ షిప్పింగ్ మధ్యధరా సముద్రం సమీపంలోని కార్గో మార్గాలను నిశితంగా పర్యవేక్షిస్తోంది. ఉద్రిక్తతలు తగ్గితే రాబోయే వారాల్లో షిప్పింగ్ ఇన్సూరెన్స్ ప్రీమియంలు తగ్గే అవకాశం ఉంది. అంతర్జాతీయ నౌకల్లో పనిచేస్తున్న వేలాది మంది భారతీయ నావికులకు ఇది ఎంతో




సురక్షితమైన వాతావరణాన్ని కల్పిస్తుంది. ప్రస్తుతం షిప్పింగ్ కంపెనీలు తమ భద్రతా నిబంధనల్లో మార్పులు చేసే ముందు మరిన్ని స్పష్టమైన సంకేతాల కోసం వేచి చూస్తున్నాయి.

# ఓరియెంటేషన్ శిక్షణ కార్యక్రమంలో పాల్గొన్న చైర్ పర్సన్ తంగళ్ళపల్లి శ్రీవాణి






**హైదరాబాద్ పల్స్ న్యూస్, జూన్ 23, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి :** హైదరాబాద్, సోమాజిగూడలోని హోటల్ మెర్క్యూర్‌లో కమిషనర్ అండ్ డైరెక్టర్ ఆఫ్ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్, తెలంగాణ తరపున, నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ అర్బన్ మేనేజ్‌మెంట్, హైదరాబాద్ వారు మంగళవారం రోజు మహిళా మేయర్లు, మున్సిపల్ చైర్ పర్సన్ లకు నిర్వహించిన ఒకరోజు ఓరియెంటేషన్ కార్యక్రమములో భువనగిరి మున్సిపల్ చైర్ పర్సన్ శ్రీమతి తంగళ్ళపల్లి శ్రీవాణి రవి కుమార్ పాల్గొనడం జరిగింది. ఇట్టి శిక్షణ కార్యక్రమములో పట్టణ పరిపాలన, పాలనా విధానాలు, అభివృద్ధి కార్యక్రమాల అమలుపై సాంకేతిక అవగాహన కల్పించడం ఈ శిక్షణ ముఖ్య ఉద్దేశం అని తెలిపారు. ఇట్టి శిక్షణా కార్యక్రమం తదనంతరం ప్రిన్సిపల్ సెక్రెటరీ డాక్టర్ టికె.శ్రీదేవి, ఐఏఎస్ ని చైర్ పర్సన్ మర్యాదపూర్వకంగా కలిసి భువనగిరి పురపాలక సంఘంలో ఖాళీగా ఉన్న వివిధ టెక్నికల్ పోస్టులను భర్తీ చేయాలని లేదా సంబంధిత అధికారులను మరియు సిబ్బందిని కేటాయించాలని కోరుతూ, పరిపాలనలో మరియు పట్టణ అభివృద్ధిలో ఇబ్బంది జరుగుతుందని వారికి తెలియజేయాగ, వారు సానుకూలంగా స్పందిస్తూ వీలైనంత త్వరలో సమస్యను పరిష్కరిస్తామని తెలియజేయడం జరిగింది.

# బిజెపి ఆధ్వర్యంలో డా.శ్యామా ప్రసాద్ ముఖర్జీకి నివాళి....

**భారత ఐక్యత, సమగ్రత కోసం ఆయన త్యాగం దేశ చరిత్రలో చిరస్మరణీయం....**

**బీజేవైఎం జిల్లా ప్రధాన కార్యదర్శి దయ్యాల కుమారస్వామి**



**హైదరాబాద్ పల్స్ న్యూస్, జూన్ 23, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి :** ఆత్మకూరు ఎం భారతీయ జనతా పార్టీ మండల శాఖ ఆధ్వర్యంలో నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి బీజేవైఎం జిల్లా ప్రధాన కార్యదర్శి దయ్యాల కుమారస్వామి ముఖ్యఅతిథిగా పాల్గొని కుమారస్వామి మాట్లాడుతూ... ఒక దేశంలో రెండు రాజ్యాంగాలు, ఇద్దరు ప్రధానమంత్రులు, రెండు జెండాలు ఉండకూడదనే సిద్ధాంతం కోసం తన జీవితాన్ని అంకితం చేసిన మహనీయుడు డా.శ్యామా ప్రసాద్ ముఖర్జీ అని అన్నారు. జమ్మూ కాశ్మీర్‌కు ప్రత్యేక హోదా కల్పించిన ఆర్టికల్ 370కు వ్యతిరేకంగా పోరాడుతూ... 1953 జూన్ 23న పోలీసు నిర్బంధంలో అనుమానాస్పద పరిస్థితుల్లో మరణించారు. భారత ఐక్యత, సమగ్రత కోసం ఆయన చేసిన త్యాగం దేశ చరిత్రలో చిరస్మరణీయం అని అన్నారు. డా.శ్యామా ప్రసాద్ ముఖర్జీ బలిదాన దినోత్సవం సందర్భంగా ఆ మహనీయునికి ఘన నివాళులు అర్పిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి సీనియర్ నాయకులు నాగం సత్తిరెడ్డి, బండారు సత్యనారాయణ, ఆంజనేయులు, వెంకటయ్య, పరకాల రాంబాబు, ఎలగందుల శ్రీను, నరసింహ, లింగస్వామి, సాయి, మధు, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

# ఆ విషయంలో పాక్ ను పట్టుకుని చితకబాదండి: ప్రపంచదేశాలకు భారత్ పిలుపు

**హైదరాబాద్ పల్స్ న్యూస్, జూన్ 23, సెంట్రల్ బ్యూరో:**
పాకిస్థాన్ ఆక్రమిత కాశ్మీర్ లో జరుగుతున్న ఆందోళనల వెనుక భారత్ హస్తం ఉందన్న పాకిస్థాన్ ఆందోళనలను భారత్ మరోసారి తీవ్రంగా ఖండించింది. దశాబ్దాలుగా ్రాశీఖ లో పాకిస్థాన్ కొనసాగిస్తున్న ఆర్థిక విధ్వంసం, ప్రాథమిక హక్కులను తుంగలో తొక్కడం తదితర కారణాలతోనే అక్కడ ఆందోళనలు జరుగుతున్నాయని పేర్కొంది. ఇలాంటి తప్పులు చేసిన పాకిస్థాన్ ను అంతర్జాతీయంగా నిలదీయాల్సిన అవసరం ఉందని స్పష్టం చేసింది. ఈ తప్పిదాలకు పాకిస్థాన్ సమాధానం చెప్పాలని డిమాండ్ చేసింది. అలాగే సింధూ నదీ జలాల వివాదంపై పాకిస్థాన్ రక్షణ మంత్రి ఖవాజా అసిఫ్ చేసిన వ్యాఖ్యలపై తీవ్రంగా తీవ్రంగా మండిపడింది. పాకిస్థాన్ జల భద్రతకు ముప్పు వాటిల్లితే భారత్ పై యుద్ధానికి దిగుతామని ఖవాజా చేసిన రెచ్చగొట్టే వ్యాఖ్యలకు భారత విదేశాంగ మంత్రి రణధీర్ జైస్వాల్ గట్టి కౌంటర్ ఇచ్చారు. పాకిస్థాన్ తన తప్పులను కప్పి



పుచ్చుకునేందుకే ఇలాంటి వ్యాఖ్యలను చేస్తోందని మండిపడ్డారు. అలాగే మానవ హక్కుల ఉల్లంఘనల నుంచి ప్రపంచ దేశాల దృష్టిని మరల్చేందుకే భారత్ పై పాకిస్థాన్ ఇలాంటి వ్యాఖ్యలను సంధిస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. " పీఓకే విషయంలో భారత్ పై పాకిస్థాన్ చేస్తున్న ఫ్యాబ్రికేటెడ్ ఆరోపణలను తీవ్రంగా ఖండిస్తున్నాం. పీఓకే లో కొనసాగుతున్న ఆందోళనలకు పాకిస్థాన్ సొంత వైఫల్యాలే కారణం. బలవంతంగా ఆ ప్రాంతాన్ని ఆక్రమించి ప్రాథమిక హక్కులను కాలరాస్తోంది. అక్కడి ప్రజలకు నిత్యావసరాలు, ఇంటర్నెట్ ను బంద్ చేసింది. ప్రజలపై దాడులకు పాల్పడింది. దాంతో అనేకమంది ప్రజలు ప్రాణాలు కోల్పోయారు. ఈ విషయంలో ప్రపంచదేశాలు పాకిస్థాన్ చేసిన తప్పులను ఎండగడతాయని అనుకుంటున్నాం" అని భారత విదేశాంగ మంత్రిత్వ శాఖ ప్రతినిధి రణధీర్ జైస్వాల్ స్పష్టం చేశారు. ఇక హోర్ముజ్ జలసంధి ఓపెన్ పై మాట్లాడుతూ భారతీయ జెండాలు కలిగిన నౌకలు హోర్ముజ్ ను ఎలాంటి ఆటంకం లేకుండా దాటుతాయని తాము విశ్వాసం వ్యక్తం చేస్తున్నట్లు తెలిపారు. భారత్ జెండాలు కలిగిన 10 నౌకలు ఇంకా పర్షియన్ గల్ఫ్ లోనే ఉన్నాయని.. రెండు ఇప్పటికే వచ్చాయని అన్నారు. జూన్ 17 న ఒప్పందం జరిగినప్పటి నుంచి ఇప్పటి వరకూ 11 భారత నౌకలు హోర్ముజ్ జలసంధిని దాటాయని పేర్కొన్నారు. ఒక్కో నౌక దాదాపు 2,85,000 మెట్రిక్ టన్నుల క్రూడ్ ఆయిల్ ను తీసుకొస్తోందని స్పష్టం చేశారు. మిగతా నౌకలు కూడా ఇదే తరహాలో హోర్ముజ్ జలసంధిని క్రాస్ చేస్తాయని ఆశాభావం వ్యక్తం చేశారు.

# వెన్నారం గ్రామంలో మొహరం ఉత్సవాలకు అపార భక్తి విశ్వాసం

**హైదరాబాద్ పల్స్, జూన్ 23, మహబూబాబాద్ ప్రతినిధి:**
డోర్నకల్ మండలంలోని వెన్నారం గ్రామంలో జరుగుతున్న మొహరం ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో వైభవంగా కొనసాగుతున్నాయి. మహబూబాబాద్ జిల్లా వెన్నారం గ్రామంలో ప్రత్యేక చరిత్ర కలిగిన ఈ ఉత్సవాలకు ప్రతి ఏడాది వేలాది మంది భక్తులు తరలివస్తుంటారు. పీరీలను దర్శించుకుని మొక్కులు చెల్లిస్తే కోరిన కోరికలు నెరవేరుతాయని, కుటుంబ సమస్యలు, ఆర్థిక ఇబ్బందులు, సంతానం లేని వారికి సంతాన భాగ్యం కలుగుతుందని, అనారోగ్య సమస్యలు తొలగిపోతాయని భక్తులలో బలమైన విశ్వాసం నెలకొంది. మంగళవారం నిర్వహించిన 8వద్దుల కార్యక్రమం సందర్భంగా హద్రా శభాష్, పెద్ద కాసిం, చిన్న కాసిం, అసేన్ హుస్సేన్, గుంటూరు మస్తాన్, జానపాటి సైదులు పీరీలను ప్రత్యేకంగా అలంకరించి గ్రామ పురవీధుల్లో ఘనంగా ఊరేగించారు. పీరీల వెంట భక్తులు ప్రార్థనలు చేస్తూ, మొక్కులు చెల్లిస్తూ పాల్గొన్నారు.



గ్రామంతో పాటు సమీప ప్రాంతాల నుంచి కూడా భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి దర్శించుకున్నారు. పీరీల వద్ద ప్రార్థనలు చేస్తే సంతానం కోసం ఎదురుచూస్తున్న దంపతులకు సంతాన భాగ్యం కలుగుతుందని, ఇంట్లో నెలకొన్న కలహాలు, సమస్యలు తొలగిపోతాయని, ఆర్థిక ఇబ్బందులు గట్టెక్కుతాయని, ఉపాధి అవకాశాలు లభిస్తాయని నమ్మకం. విద్య, ఉద్యోగం, ఆరోగ్యం, కుటుంబ సంక్షేమం కోసం కూడా భక్తులు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించడం ఆనవాయితీగా కొనసాగుతోంది. మొక్కులు నెరవేరిన అనంతరం తిరిగి వచ్చి పీరీలకు కానుకలు సమర్పించడం కూడా ఇక్కడి ప్రత్యేక సంప్రదాయంగా చెప్పుకుంటారు. వెన్నారం గ్రామంలోని మొహరం ఉత్సవాలు కేవలం ఒక మతానికి పరిమితం కాకుండా అన్ని వర్గాల ప్రజలను ఏకం చేస్తున్నాయి. హిందూ, ముస్లిం, క్రైస్తవ మతాలకు చెందిన ప్రజలు సమానంగా పాల్గొని మత సామరస్యానికి నిదర్శనంగా నిలుస్తున్నారు. తరతరాలుగా కొనసాగుతున్న ఈ పండుగ 11, రోజుల పాటు గ్రామ ఐక్యతకు, సోదరభావానికి ప్రతీకగా నిలిచిందని గ్రామ పెద్దలు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ముజావారి ఖలీల్ పాషా, కొప్పుల సతీష్,ఏర్పుల లచ్చయ్య, దొడ్డ మహేష్, గంట భాస్కర్, శెట్టి శ్రీకాంత్, బోయినపల్లి మహేష్, బొల్లి కొండ యాకూబ్, ఏర్పుల ముత్తయ్య, శాతరాజు పెల్లి కృష్ణ, అన్నపర్తి సైదులు, కనకయ్య, చంద్రయ్య, నారాయణ ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.

# ఈ రెండూ ఉంటే చాలు-ఆన్ లైన్ లో "ఎస్.ఐ.ఆర్" పూర్తి-7 స్టెప్స్ ఇలా..!

**హైదరాబాద్ పల్స్ న్యూస్, జూన్ 23 :**
తెలుగు రాష్ట్రాల్లో సాగుతున్న ప్రత్యేక ఓటర్ల జాబితాల సవరణ ప్రక్రియలో బీఎల్వోలు కీలకంగా మారారు. అయితే వారిపై ఉన్న పని ఒత్తిడి నేపథ్యంలో ఇంకా చాలా మంది ఓటర్లకు ఎస్ఐఆర్ ఫారం కూడా అందలేదనే ఫిర్యాదులు వస్తున్నాయి. అలాగే ఎస్ఐఆర్ ఫారం ఇచ్చినా వాటిని పూర్తి చేశాక తిరిగి తీసుకోవడంలో ఆలస్యం చేస్తున్నారనే ఫిర్యాదులు కూడా ఉన్నాయి. ఈ నేపథ్యంలో రెండు పాయింట్లు కరెక్ట్ గా ఉంటే చాలు మీ ఎస్ఐఆర్ ఫారం ఆన్ లైన్ లో ఎలా సులువుగా పూర్తి చేసి సబ్మిట్ చేసుకోవచ్చో ఇక్కడ చూద్దాం...ఎస్ఐఆర్ ఫారం ఆన్ లైన్ లో సమర్పించాలంటే రెండు అంశాలు తప్పనిసరి. ఇందులో ఒకటి ఓటర్ కార్డుకు మొబైల్ నంబర్ లింక్ అయి ఉండాలి. రెండవది ఓటరు కార్డులోని పేరు ఆధార్ కార్డులోని అక్షరాలతో ఖచ్చితంగా సరిపోలాలి. ఏమాత్రం సరిపోలకపోయినా ఇ-సైన్ ప్రక్రియ విఫలమవుతుంది.ఇది సరిపోలని పక్షంలో మాత్రం ఓటరు బీఎల్వో ద్వారా భౌతిక ఫారమ్‌ను సమర్పించాల్సి ఉంటుంది. ఈ రెండు అంశాలు సరిగ్గా ఉంటే మాత్రం ఆన్ లైన్ లో ఫారం ఎలా సమర్పించాలో ఇక్కడ చూద్దాం..

1. పోర్టల్‌ను యాక్సెస్ చేసి, లాగిన్ కావాలి. ఈసీఐ ఓటర్ సర్వీస్ పోర్టల్ ను ఓపెన్ చేయాలి. ఇందులో ఓటర్లు తాము ఇప్పటికే ఈ వెబ్ సైట్ లేదా యాప్ లో నమోదు చేసుకున్న వివరాలతో లాగిన్ కావాలి. లేదా కొత్త యూజర్ గా సైనప్ చేసుకుని లాగిన్ కావచ్చు.
2. ఎన్యూమరేషన్ ఫారమ్‌ను నింపడం. యూజర్ డాష్‌బోర్డ్‌లో "ఎన్యూమరేషన్ ఫారమ్ నింపండి" బటన్‌పై క్లిక్ చేయాలి. ప్రాంతీయ డేటాబేస్‌ను పొందడానికి డ్రాప్‌డౌన్ మెనూ నుండి రాష్ట్రాన్ని ఎంచుకోవాలి.
3. ఎపిక్ నంబర్ ను ఇందులో ఎంటర్ చేయాలి. తర్వాత సెర్చ్ బటన్‌పై క్లిక్ చేస్తే పోర్టల్ లైవ్ డేటాబేస్ నుండి ప్రస్తుత ఓటర్ల డేటాను తీసుకుంటుంది.






పాక్షికంగా ముందుగా నింపిన ఎన్యూమరేషన్ ఫారమ్ డ్రాఫ్ట్ స్క్రీన్‌పై కనిపిస్తుంది.

4. మొబైల్ ఓటిపి ధృవీకరణను పూర్తి చేయాలి. ఇందుకోసం ముందుగా "ఎంటర్ ఓటిపి" బటన్‌పై క్లిక్ చేయాలి. ఇ పి ఐ సి తో నమోదు చేసుకున్న మొబైల్ నంబర్‌కు ఓటిపి వస్తుంది. అప్పుడు అక్కడ ఉన్న ఫీల్డ్‌లో ఓటిపిని నమోదు చేయాలి ఇది ఫారమ్‌లోని మిగిలిన భాగాన్ని అన్‌లాక్ చేస్తుంది.
5. గత ఎస్ఐఆర్ కు ప్రస్తుత ఓటరు కార్డును మ్యాప్ చేయడం. ఇందులో ఓటరు స్థితిని గత ఎస్ఐఆర్ బేస్ రోల్‌కు లింక్ చేయడానికి మూడు మార్గాలున్నాయి. ఇందులో తగిన ఆప్షన్ ఎంచుకోవాలి. మొదటిది నా పేరు చివరి ఎస్.ఐ.ఆర్ యొక్క ఓటర్ల జాబితాలో ఉంది, రెండవది నా తల్లిదండ్రుల పేరు (తండ్రి/తల్లి/తాత/నానమ్మ) చివరి ఎస్.ఐ.ఆర్లో ఉంది. మూడవది నా పేరు గానీ, నా తల్లిదండ్రుల పేరు గానీ చివరి ఎస్ఐర్ లో లేదు అనే ఆప్షన్స్ ఉంటాయి. మీ వివరాలు అందుబాటులో లేకపోతే, పోర్టల్ డాష్‌బోర్డ్‌లోని "చివరి ఎస్.ఐ.ఆ లో మీ పేరును సెర్చ్ చేయాలనే ఆప్షన్ కూడా ఉంది.
6. అదనపు/బంధువుల వివరాలను అందించాలి. ఐదో ఆప్షన్ లో ఎంపిక ఆధారంగా నిర్దిష్ట టెక్స్ట్ ఫీల్డ్‌లను పూరించాలి. ఓటరు పేరు పాత జాబితాలో లేకపోయి, కుటుంబ సభ్యుని పేరు ఉంటే బంధువు పేరును నమోదు చేయాలి. సంబంధం రకం, పాత నియోజకవర్గం/పార్ట్ నంబర్ వివరాలు నమోదు చేయాలి. అలాగే పుట్టిన తేదీని అప్డేట్ చేసుకోవచ్చు. అలాగే తాజా పాస్‌పోర్ట్ ఫోటోను అప్‌లోడ్ చేయాలి.
7. ఆధార్ ఇ-సైన్ ప్రక్రియ పూర్తి చేయాలి. ఫారమ్‌లోని అక్షరదోషాలను సమీక్షించడానికి ప్రివ్యూ బటన్‌పై క్లిక్ చేయాలి. సరిగ్గా ఉంటే, డిక్లరేషన్ చెక్‌బాక్స్‌ను టిక్ చేయాలి. అనంతరం సమర్పించు పై క్లిక్ చేయాలి. పోర్టల్ ఆధార్ ఇ-సైన్ గేట్‌వేకి మళ్లిస్తుంది. అక్కడ ఆధార్ నంబర్‌ను నమోదు చేయాలి. ఆధార్‌తో అనుసంధానించబడిన మొబైల్ ఓటీపీ ద్వారా ధృవీకరించాలి. దీంతో డిజిటల్ సంతకం జోడించబడుతుంది. దీంతో ఆన్‌లైన్ సమర్పణ పూర్తయినట్లే. ఆ తర్వాత పని ఎన్నికల అధికారులు చూసుకుంటారు.

## ప్రొటీన్లు ఉండే ఆహారాలను రోజూ తింటే ఎన్నో లాభాలు..

# ఏయే ఆహారాలు మేలు చేస్తాయంటే..



బరువు తగ్గాలనుకునే వారికి అధిక ప్రోటీన్ ఆహారం ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని అనేక అధ్యయనాలు సూచిస్తున్నాయి. ప్రోటీన్ అధికంగా ఉండే ఆహారం ఆకలిని తగ్గించడమే కాకుండా ఎక్కువసేపు కడుపు నిండిన భావనను కలిగిస్తుంది. అంతేకాకుండా శరీరం రోజులో ఖర్చు చేసే కేలరీల సంఖ్యను పెంచడంలోనూ సహాయపడుతుంది. దీని వల్ల శరీరంలోని కొవ్వు తగ్గి కండరాల దృఢత్వం పెరుగుతుంది. ముఖ్యంగా దీర్ఘకాలం పాటు అధిక ప్రోటీన్ ఆహారాన్ని కొనసాగించే వారిలో తిరిగి బరువు పెరిగే అవకాశాలు తక్కువగా ఉంటాయని పరిశోధనలు చెబుతున్నాయి. వే ప్రోటీన్ బరువు తగ్గడంలో ప్రముఖ పాత్ర పోషించే ప్రోటీన్లలో ఒకటి. పాల నుంచి లభించే ఈ ప్రోటీన్ త్వరగా కడుపు నిండిన భావనను కలిగిస్తుంది. ఇతర ప్రోటీన్ మూలాలతో పోలిస్తే ఆకలిని సమర్థంగా నియంత్రిస్తుందని కొన్ని అధ్యయనాలు సూచిస్తున్నాయి. అలాగే శరీర నిర్మాణాన్ని మెరుగుపరచడంలోనూ ఇది సహాయపడుతుంది.

బరువు తగ్గడంలో..

ప్రోటీన్ అధికంగా ఉండే ఆహారాలు కూడా బరువు తగ్గడంలో కీలక పాత్ర పోషిస్తాయి. గుడ్లు, చికెన్, చేపలు, పాలు, పనీర్, చీజ్, పప్పుధాన్యాలు, క్వినోవా, నట్స్ వంటి ఆహారాలు ఎక్కువసేపు ఆకలి వేయకుండా చేసి రోజంతా అనవసరంగా తినాలనే కోరికను తగ్గిస్తాయి. సోయా ప్రోటీన్ కూడా బరువు నియంత్రణలో సహాయపడే మొక్కల ఆధారిత ప్రోటీన్‌గా గుర్తింపు పొందింది. సోయాబీన్స్ నుంచి తయారయ్యే ఈ ప్రోటీన్‌లో శరీరానికి అవసరమైన ముఖ్యమైన అమైనో ఆమ్లాలు ఉంటాయి. అయితే బరువు తగ్గడంలో దీని ప్రభావాన్ని పూర్తిగా నిర్ధారించే బలమైన శాస్త్రీయ ఆధారాలు ఇంకా పరిమితంగానే ఉన్నాయి. కేసిన్ ప్రోటీన్ కూడా పాల నుంచే లభించే మరో ముఖ్యమైన ప్రోటీన్. ఇది నెమ్మదిగా జీర్ణమవడం వల్ల ఎక్కువసేపు కడుపు నిండిన భావన కలుగుతుంది. అందువల్ల తరచూ ఆకలి వేయకుండా ఉండటంతో బరువు తగ్గడంలో సహాయపడుతుంది.

ఆకలి నియంత్రణకు..

బఠానీ ప్రోటీన్ లేదా పీ ప్రోటీన్‌లో కూడా శరీరానికి అవసరమైన అమైనో ఆమ్లాలు ఉంటాయి. ఇవి తృప్తి భావనను పెంచి ఎక్కువసేపు ఆకలిని నియంత్రిస్తాయి. అలాగే శరీర నిర్మాణాన్ని మెరుగుపరచడంలోనూ కొంత మేర ప్రయోజనం కలిగిస్తాయి. రైస్ ప్రోటీన్ మరో మొక్కల ఆధారిత ప్రోటీన్. ఇందులో అన్ని అవసరమైన అమైనో ఆమ్లాలు లేకపోయినా, సాధారణంగా పీ ప్రోటీన్‌తో కలిపి ఉపయోగిస్తారు. ఇది శరీరంలోని కొవ్వును తగ్గించి కండరాల పరిమాణాన్ని పెంచడంలో తోడ్పడుతుంది. హెంప్ ప్రోటీన్‌లో ఒమెగా-3 కొవ్వు ఆమ్లాలు, పీచుపదార్థం సమృద్ధిగా ఉంటాయి. అయితే ఇందులో అన్ని అవసరమైన అమైనో ఆమ్లాలు లేకపోవడం వల్ల దీనిని పూర్తి ప్రోటీన్‌గా పరిగణించరు. అయినప్పటికీ సమతుల ఆహారంలో భాగంగా తీసుకుంటే ప్రయోజనకరంగా ఉంటుంది.

ప్రోటీన్ మాత్రమే కాదు..

బోన్ బ్రోత్ ప్రోటీన్ జంతువుల ఎముకలను నీటిలో మరిగించడం ద్వారా తయారవుతుంది. ఈ ప్రక్రియలో ఎముకలలోని కొన్ని పోషకాలు ద్రవంలోకి వస్తాయి. అయితే ఇది కూడా పూర్తి ప్రోటీన్ కాదు. అయినప్పటికీ కొందరు దీనిని ప్రోటీన్ సప్లిమెంట్‌గా వినియోగిస్తారు. అయితే బరువు తగ్గడానికి కేవలం ప్రోటీన్ మాత్రమే సరిపోదు. సమతుల ఆహారం, క్రమమైన వ్యాయామం, తగినంత నిద్ర, ఆరోగ్యకర జీవనశైలి కూడా సమానంగా అవసరం. అధిక ప్రోటీన్ ఆహారం తీసుకునే ముందు వ్యక్తిగత ఆరోగ్య పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని నిపుణుల సలహా తీసుకోవడం మంచిది.

# అరటి ఆకులపై భోజనం చేయడం రుచికరం, ఆరోగ్యకరం..

అరటి ఆకుపై భోజనం చేయడం భారతీయ సంప్రదాయంలో ప్రత్యేక స్థానాన్ని కలిగి ఉంటుంది. ముఖ్యంగా దక్షిణ భారతదేశంలో పండుగలు, శుభకార్యాలు, కుటుంబ వేడుకల సమయంలో అరటి ఆకులపై ఆహారం వడ్డించడం ఆనవాయితీగా కొనసాగుతోంది. ఇది కేవలం సంప్రదాయం మాత్రమే కాకుండా ఆరోగ్యపరంగా కూడా అనేక ప్రయోజనాలను అందిస్తుందని నిపుణులు చెబుతున్నారు. అందుకే ఇప్పటికీ ఓనమ్ సద్య వంటి ప్రత్యేక విందులను అరటి ఆకులపై వడ్డించే పద్ధతి కొనసాగుతోంది. అరటి ఆకుల్లో సహజంగా పాలీఫినాల్స్ అనే యాంటీ ఆక్సిడెంట్లు అధికంగా ఉంటాయి. ఇవి గ్రీన్ టీతోపాటు అనేక మొక్కల ఆధారిత ఆహారాల్లో కనిపించే పోషక పదార్థాలు. వేడి ఆహారాన్ని అరటి ఆకుపై వడ్డించినప్పుడు ఈ పాలీఫినాల్స్ కొంతమేర ఆహారంలోకి చేరే అవకాశం ఉందని భావిస్తారు. ఇవి శరీరాన్ని ఆక్సీకరణ ఒత్తిడి నుంచి రక్షించడంలో సహాయపడటంతోపాటు జీవనశైలి సంబంధిత వ్యాధుల ప్రమాదాన్ని తగ్గించడంలో కూడా ఉపయోగపడతాయి.

పర్యావరణ హితం..

అరటి ఆకులపై భోజనం చేయడం అత్యంత తక్కువ ఖర్చుతో కూడుకున్న పద్ధతిగా చెప్పవచ్చు. పెద్ద ఎత్తున పాత్రలను కొనుగోలు చేయాల్సిన అవసరం ఉండదు. ఆకులను శుభ్రంగా కడిగి నేరుగా ఉపయోగించవచ్చు. దీంతో పెద్ద కార్యక్రమాల్లో కూడా ఖర్చును తగ్గించుకోవచ్చు. పర్యావరణ పరిరక్షణ పరంగా కూడా అరటి ఆకులు ఉత్తమ ప్రత్యామ్నాయంగా నిలుస్తాయి. ప్లాస్టిక్ డిస్పోజబుల్ ప్లేట్లతో పోలిస్తే ఇవి పూర్తిగా సహజసిద్ధంగా కరిగిపోతాయి. ప్లాస్టిక్ వ్యర్థాలు పర్యావరణానికి హాని కలిగిస్తుండగా, అరటి ఆకులు ఎలాంటి కాలుష్యాన్ని సృష్టించవు. అంతేకాకుండా పాత్రలు కడగడానికి ఉపయోగించే రసాయనాల అవసరం కూడా తగ్గుతుంది.



ప్రత్యేక రుచి, పరిశుభ్రత..

పరిశుభ్రత పరంగా కూడా అరటి ఆకులకు ప్రత్యేక ప్రాధాన్యం ఉంటుంది. సాధారణ పాత్రలను సబ్బుతో కడిగిన తర్వాత కూడా కొన్నిసార్లు రసాయన అవశేషాలు మిగిలిపోయే అవకాశం ఉంటుంది. అయితే అరటి ఆకులను నీటితో శుభ్రం చేసిన తర్వాత నేరుగా ఉపయోగించవచ్చు. వీటి ఉపరితలంపై ఉండే సహజమైన మైనపు పొర దుమ్ము, ధూళి సులభంగా అంటకుండా చేస్తుంది. అంతేకాకుండా అరటి ఆకులపై వడ్డించిన ఆహారానికి స్వల్పమైన సహజ సువాసన, ప్రత్యేక రుచి కూడా వస్తుంది. అందువల్ల భోజనం మరింత రుచికరంగా అనిపిస్తుంది. ఆరోగ్యం, పరిశుభ్రత, పర్యావరణ పరిరక్షణ, సంప్రదాయం వంటి అనేక అంశాలను కలగలిపిన అరటి ఆకుపై భోజనం చేసే పద్ధతి ఇప్పటికీ భారతీయ సంస్కృతిలో ప్రత్యేకతను నిలబెట్టుకుంటోంది.

## జుట్టు రాలిపోయే సమస్య ఉన్నవారికి మేలు చేసే ఆయుర్వేద మూలికలు ఇవే.. ఎలా వాడాలంటే..



జుట్టు రాలిపోవడం ప్రస్తుతం చాలా మందిని వేధిస్తున్న సాధారణ సమస్యగా మారింది. మార్కెట్లో లభించే అనేక హెయిర్ ట్రీట్‌మెంట్లు ఉపయోగించినప్పటికీ ఆశించిన ఫలితాలు రాకపోతే, సహజ పద్ధతుల వైపు మొగ్గు చూపడం మంచిదని ఆయుర్వేదం సూచిస్తోంది. ఆయుర్వేదం ప్రకారం శరీరంలో పిత్త దోషం పెరగడం వల్ల జుట్టు రాలే సమస్య ఎక్కువవుతుంది. శరీరంలో అధిక వేడి, ఒత్తిడి, అసమతుల్య జీవనశైలి కారణంగా జుట్టు బలహీనపడుతుంది. ఈ నేపథ్యంలో కొన్ని సహజ మూలికలు, నూనెలు జుట్టు ఆరోగ్యాన్ని మెరుగుపరచడంలో సహాయపడతాయని చెబుతున్నారు. పిత్త దోషాన్ని నియంత్రించేందుకు ధూమపానం, మద్యం, అధికంగా కాఫీ, టీ సేవించడం తగ్గించాలి. అలాగే పుల్లని ఆహారాలను పరిమితంగా తీసుకోవడం, తగినంత నిద్రపోవడం, ఒత్తిడిని తగ్గించుకోవడం ద్వారా జుట్టు ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని ఆయుర్వేద నిపుణులు సూచిస్తున్నారు.

జోజోబా ఆయిల్, అశ్వగంధ..

జోజోబా ఆయిల్ జుట్టు సంరక్షణలో ప్రముఖ స్థానాన్ని సంపాదించుకుంది. ఇది తలకు పోషణ అందించి జుట్టు పెరుగుదలను ప్రోత్సహించడంలో సహాయపడుతుంది. క్రమం తప్పకుండా జోజోబా ఆయిల్‌తో తలకు మసాజ్ చేయడం వల్ల ఒత్తిడి తగ్గి, నిద్ర నాణ్యత మెరుగుపడటంతోపాటు జుట్టు మూలాలు బలపడతాయి. అశ్వగంధ పిత్త దోషాన్ని సమతుల్యం చేసే ముఖ్యమైన ఔషధ మూలికగా గుర్తింపు పొందింది. ఇందులో ఉండే యాంటీ ఆక్సిడెంట్లు జుట్టు రాలడాన్ని తగ్గించడంలో సహాయపడతాయి. అలాగే శరీర రోగనిరోధక శక్తిని పెంచడంతోపాటు శరీరంలోని వ్యర్థాలను తొలగించడంలో కూడా ఉపయోగపడుతుంది. ఉసిరికాయను జుట్టు ఆరోగ్యానికి అత్యంత ప్రయోజనకరమైన సహజ పదార్థంగా భావిస్తారు. ఇందులో విటమిన్-సి, యాంటీ ఆక్సిడెంట్లు, ఖనిజాలు సమృద్ధిగా ఉంటాయి. ఉసిరి పొడిని మెంతుల పొడి, బ్రాహ్మి పొడితో కలిపి పెరుగులో మిశ్రమంగా తయారు చేసి జుట్టుకు ప్యాక్‌లా వేసుకోవచ్చు. గంటకు పైగా ఉంచి తేలికపాటి షాంపూతో కడిగితే జుట్టు మెత్తగా మారడమే కాకుండా తెల్లజుట్టు సమస్య కూడా తగ్గే అవకాశం ఉంటుంది.

జటమాంసి, బాదంనూనె..

జటమాంసి అనేక హెయిర్ టానిక్‌లలో ఉపయోగించే మూలిక. ఇది యాంటీ ఫంగల్ లక్షణాలను కలిగి ఉండి జుట్టు మూలాలను పునరుజ్జీవింపజేయడంలో సహాయపడుతుంది. తల చర్మంపై వచ్చే ఇన్ఫెక్షన్లను తగ్గించడంలో కూడా ఉపయోగపడుతుంది. బాదం నూనెలో జటమాంసి వేరును కలిపి తయారు చేసిన మిశ్రమాన్ని ఉపయోగించడం వల్ల జుట్టు మెరుస్తూ, బలంగా మారుతుంది. చుండ్రు, తల చర్మ ఇన్ఫెక్షన్లు కూడా జుట్టు రాలడానికి ప్రధాన కారణాల్లో ఒకటి. వేపలో ఉండే యాంటీ బ్యాక్టీరియల్ గుణాలు ఈ సమస్యలను తగ్గించడంలో సహాయపడతాయి. ఒక కప్పు వేప ఆకులను నీటిలో మరిగించి, ఆ నీటిని వడకట్టి షాంపూ చేసిన తర్వాత తలకు పోస్తే చుండ్రు తగ్గి జుట్టు రాలడం కూడా తగ్గుతుంది. వేప నూనెతో మసాజ్ చేయడం కూడా ప్రయోజనకరంగా ఉంటుంది.

భృంగరాజ్..

భృంగరాజ్‌ను ఆయుర్వేదంలో మూలికల రాజుగా పరిగణిస్తారు. ఇది జుట్టు మళ్లీ పెరగడానికి తోడ్పడుతుంది. భృంగరాజ్ హెయిర్ మాస్క్‌ను జుట్టుకు అప్లై చేయడం లేదా భృంగరాజ్ నూనెతో తలకు మసాజ్ చేసి రాత్రంతా ఉంచడం వల్ల జుట్టు కుదుళ్లు బలపడటంతోపాటు జుట్టు మరింత మెరిసేలా మారుతుంది. జుట్టు రాలడానికి పోషకాహార లోపాలు, హార్మోన్ల అసమతుల్యత, థైరాయిడ్ సమస్యలు, ఒత్తిడి వంటి అనేక కారణాలు ఉంటాయి. కాబట్టి సమస్య ఎక్కువకాలం కొనసాగితే వైద్య నిపుణులను సంప్రదించడం మంచిది.

# టూత్ సెన్సిటివిటీ అధికంగా ఉందా.. అయితే ఈ ఇంటి చిట్కాలను పాటించండి..


దంతాల సున్నితత్వం (టూత్ సెన్సిటివిటీ) చాలా మందిని ఇబ్బంది పెట్టే సాధారణ సమస్య. వేడి టీ, చల్లని ఐస్‌క్రీమ్ లేదా పుల్లని ఆహారం తీసుకున్నప్పుడు దంతాలలో ఒక్కసారిగా గుచ్చినట్టు నొప్పి అనిపించడం దీని ప్రధాన లక్షణం. దంతాలపై ఉండే ఎనామెల్ పొర దెబ్బతినడం వల్ల లోపలి డెంటిన్ బయటపడితే ఈ సమస్య ఏర్పడుతుంది. అమెరికన్ డెంటల్ అసోసియేషన్ జర్నల్ ప్రకారం ప్రతి ఎనిమిది మంది పెద్దల్లో ఒకరు ఈ సమస్యతో బాధపడుతున్నట్లు వెల్లడైంది. దంతాలను గట్టిగా లేదా ఎక్కువ ఒత్తిడితో బ్రష్ చేయడం, అధికంగా ఆమ్ల గుణాలు ఉన్న ఆహారాలు, పానీయాలను తీసుకోవడం, దంతాలను రాత్రిపూట రుద్దకపోవడం, పాత ఫిల్లింగ్స్ దెబ్బతినడం, దంత క్షయం లేదా కొన్ని దంత చికిత్సల తర్వాత కూడా టూత్ సెన్సిటివిటీ కనిపిస్తుంది. టూత్ సెన్సిటివిటీ నుంచి ఉపశమనం పొందేందుకు ఉప్పునీరు ఉపయోగకరంగా ఉంటుంది. ఇది నోటిలో పీహెచ్ సమతుల్యతను కాపాడి హానికర బ్యాక్టీరియా పెరుగుదలను అడ్డుకుంటుంది. అంతేకాకుండా సహజ యాంటీ సెప్టిక్‌గా పనిచేసి నొప్పిని తగ్గించడంలో సహాయపడుతుంది. గోరువెచ్చని నీటిలో రెండు టీ స్పూన్ల ఉప్పు కలిపి రోజుకు రెండు సార్లు పుక్కిలించడం వల్ల సున్నితత్వం, నొప్పి తగ్గే అవకాశం ఉంటుంది.

జామ ఆకులు, వెల్లుల్లి..

జామ ఆకులు కూడా ఈ సమస్యకు సహజ పరిష్కారంగా ఉపయోగపడతాయి. వీటిలో క్వెర్సెటిన్, కాంఫెరాల్, రుటిన్ వంటి ఫ్లేవనాయిడ్లు ఉండి వాపులను తగ్గించడంలో సహాయపడతాయి. రెండు నుంచి మూడు నిమిషాల పాటు కొన్ని జామ ఆకులను నమిలి ఉమ్మేయవచ్చు. లేదా నాలుగు నుంచి ఐదు ఆకులను నీటిలో మరిగించి కొద్దిగా ఉప్పు కలిపి మౌత్‌వాష్‌గా ఉపయోగించవచ్చు. వెల్లుల్లిలో ఉండే యాంటీ బ్యాక్టీరియల్ గుణాలు నోటి ఆరోగ్యాన్ని మెరుగుపరచడంలో సహాయపడతాయి. అలాగే ఇది సహజ నొప్పి నివారిణిగా కూడా పనిచేస్తుంది. రెండు లేదా మూడు వెల్లుల్లి రెబ్బలను కొద్దిగా నీరు, అర టీ స్పూన్ ఉప్పుతో కలిపి పేస్ట్‌గా తయారు చేసి ప్రభావిత దంతంపై కొన్ని నిమిషాలు ఉంచాలి. అనంతరం గోరువెచ్చని ఉప్పునీటితో నోరు కడుక్కోవాలి. లవంగ నూనెను దంతాల నొప్పిని తగ్గించడంలో చాలా కాలంగా ఉపయోగిస్తున్నారు. ఇందులో ఉండే క్రిమినాశక, వాపు నిరోధక, నొప్పిని తగ్గించే గుణాలు దంతాల సున్నితత్వాన్ని తగ్గించడంలో సహాయపడతాయి. ఒక చుక్క లవంగ నూనెను కొబ్బరి లేదా బాదం నూనెలో కలిపి ప్రభావిత ప్రాంతంలో రాయడం ద్వారా ఉపశమనం పొందవచ్చు. కొద్దిసేపటి తర్వాత గోరువెచ్చని నీటితో శుభ్రం చేయాలి.

ఉల్లిపాయలు..

ఉల్లిపాయలో ఉండే క్వెర్సెటిన్ అనే ఫ్లేవనాయిడ్ వాపును తగ్గించి నొప్పిని ఉపశమింపజేస్తుంది. అలాగే దీని యాంటీ బ్యాక్టీరియల్, యాంటీ మైక్రోబియల్ గుణాలు నోటిలోని హానికర బ్యాక్టీరియాను తగ్గించడంలో సహాయపడతాయి. చిన్న ఉల్లిపాయ ముక్కను ప్రభావిత ప్రాంతంలో ఐదు నిమిషాల పాటు ఉంచి, తర్వాత ఉప్పునీటితో నోరు కడుక్కోవడం మంచిది. అయితే ఈ సహజ చిట్కాలు తాత్కాలిక ఉపశమనం ఇవ్వగలిగినా, నొప్పి ఎక్కువకాలం కొనసాగితే లేదా చిగుళ్ల నుంచి రక్తస్రావం వంటి సమస్యలు ఉంటే తప్పనిసరిగా దంత వైద్యుడిని సంప్రదించడం అవసరమని నిపుణులు చెబుతున్నారు.



Edited, Published and Owned by Konadoddi Naveen Kumar and Printed at Srinith Publications Falcon Printing Press #1-2-201, Shop No.02, Khan Street Zaheerabad 502220.T.G. And Published from #1-2-201, Shop No.02, Khan Street Zaheerabad 502220.T.G. Editor's Konadoddi Naveen Kumar, Dr.Tadhkal Rahul Kumar Reg. No.TEL-TEL/2023/12249. Email.HyderabadPulse23@gmail.com, Web:www.HyderabadPulse.com, Cell: +91-94406 53413, +91-9989834020.